epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 28 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 4 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## సైబర్ నేరాల పట్ల సుప్రీంకోర్టు ఆందోళన

బాధితులు సుమారు 3000 కోట్లు కోల్పోవడం దారుణం

డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిందే

డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చాలా విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం షాక్ వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో బాధితులు సుమారు 3000 కోట్లు కోల్పోవడం పట్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

4



## భారత ఆడబిడ్డలు గెలిచి చూపారు

వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా

బాహుబలి ప్రయోగంతో ఇస్రో ఘనత

ఇరువురికి అభినందనలు తెలిపిన మోడీ

5

# ఘోరం ప్రమాదం



చేవెళ్ల వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్న కంకర టిప్పర్

## ప్రమాదంలో 20మంది మృతి

పులువురికి తీవ్ర గాయాలు

ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

మృతుల సంఖ్య పెరిగే అవకాశం



రంగారెడ్డి జిల్లాలో సోమవారం వేకువ జామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చేవెళ్ల వద్ద ఆర్టీసీ బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ లారీ ఢీ కొట్టి బోల్తా పడిపోయింది. ఈ ఘటనలో 20 మంది మృతి చెందినట్లు తెలుస్తుండగా, 19మంది మరణించారని రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్షతగాత్రులకు చికిత్స అందుతుండగా.. వాళ్లలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండనున్నట్టు తెలుస్తున్నది.

### ప్రమాద ఘటనపై సీఎం దిగ్భ్రాంతి

తక్షణ సహాయక చర్యలకు ఆదేశం



..ఎ 2లో

**రంగారెడ్డి, నవంబర్ 3:** రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 20 మంది మృతి చెందగా.. 20 మంది తీవ్రంగా గాయడ్డారు. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దానికింద కూరుకుపోయారు. మృతుల్లో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. ప్రమాద సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీసారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 14 మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయినట్లు మంత్రి

మిగతా 2 లో




## రాజకీయ దురుద్దేశంతోనే ఎస్ఎల్‌బీసీ పడావు

- పదేళ్లలో పనులు చేయలేకపోయిన కేసీఆర్
- కమీషన్లు రావనే ప్రాజెక్టుపై అశ్రద్ధ
- ఇప్పుడేమో హరీష్ రావు అవాకులు చవాకులు
- ఎట్టి పరిస్థితుల్లోనూ టన్నెల్ పనులు పూర్తి చేస్తాం
- టన్నెల్ నిర్మాణపనులపై సీఎం రేవంత్ పరిశీలన

రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్ హయాంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ను పక్కకు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తప్పులు చేసి.. అప్పులు చేసి దోపిడీ చేశారనే కారణంతోనే ప్రజలు బీఆర్ఎస్‌ని పక్కన బెట్టారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలని క్షమించరని హెచ్చరించారు.

**నాగర్‌కర్నూల్, నవంబర్ 3:** ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ని తమ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ విష యం లో తమ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. నాగర్‌క ర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతంపై సీఎం రేవంత్‌రెడ్డి జియో ఫిజికల్ సర్వే నిర్వహించారు. ఎస్ ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రా జెక్టు 1983లో మంజూరైందని, ఇప్పటికీ పూర్తికాక పోవడం బాధాకరమని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లెలో పర్యటించిన సీఎం..

మిగతా 2 లో



## రాజస్థాన్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం

తాగి ట్రక్ నడిపిన డ్రైవర్

ప్రమాదంలో 10మంది దుర్మరణం

04

## దయనీయంగా పత్తిరైతుల పరిస్థితి



తేమ పేరుతో మోసం చేస్తున్నారు

జిల్లా పర్యటనలో కవిత విమర్శలు

03



పారిశ్రామిక, ఇంధన రంగాల అభివృద్ధికి

## మరో కీలక ముందడుగు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో హిందూజా గ్రూప్ కీలక ఒప్పందం

లండన్ నుంచి సీఎం చంద్రబాబు ప్రకటన


రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్న సంస్థ

విశాఖలో 1,600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ విస్తరణ

రాయలసీమలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు

**అమరావతి :** పారిశ్రామిక, ఇంధన రంగాల అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రముఖ పారిశ్రామిక సంస్థ హిందూజా గ్రూప్‌తో 20,000 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు

05



## ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు

- 700 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం అనుమతి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశాలు

03

## తుపాకీతో కాల్చుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య

బెట్టింగ్ గేమ్స్ వ్యసనమే కారణం

సంగారెడ్డిలో విషాదం

03

సంగారెడ్డి జిల్లా మహబూబ్ సాగర్ చెరువు కట్ట వద్ద సందీప్ అనే కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్సే కారణంగా తెలుస్తోంది.





# రాజకీయ దురుద్దేశంతోనే ఎస్ఎల్బీసీ పడావు

మొదటి పేజీ తరువాయి

హెలీ మాగ్నటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న సర్వే హెలికాప్టర్, అధునాతన పరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. టన్నెల్ బోర్ మిషన్‌తో పనులు చేయడం కష్టంగా మారిందని, పనులపై భారత రాష్ట్ర సమితి నాయకులు రాజకీయం చేయడం తగదని అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. టన్నెల్ పనులు పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు చేసినప్పుడు టన్నెల్ పనుల అంచనా విలువ రూ.1,968 కోట్లు. రెండు దశాబ్దాలుగా సాగుతున్న టన్నెల్ పనుల్లో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడేనాటికి 30 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తయింది. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో మిగతా 10కి.మీ టన్నెల్ పూర్తి చేయలేదు. పెద్దగా కమీషన్లు రావని ఈ ప్రాజెక్టును పక్కకు పెట్టారు. ఏపీలో జగన్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడును విస్తరిస్తుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకున్నారు. రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఉమ్మడి నల్గొండ జిల్లాలకు నీరు అందేది. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో పట్టించుకోలేదు. కృష్ణా నది మీద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు చెల్లించింది. ఆ మొత్తంలో కాళేశ్వరం కాంట్రాక్టర్లకే రూ.1.06 లక్షల కోట్లు చెల్లించారు. గత పదేళ్లలో ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ఎన్నో ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేసింది. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రభుత్వం కృష్ణానదిపై ప్రాజెక్టులు పూర్తి చేయలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఆయా ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరం చెబుతోందని పేర్కొన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసైపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉండి ఉంటే టన్నెల్ పనులు ఎప్పుడో పూర్తయ్యేవని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్బీసీని గత కేసీఆర్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. కమీషన్లు రావని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎస్ఎల్బీసీని పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 10 కిలోమీటర్లు కూడా టన్నెల్ పనులు పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. టన్నెల్ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కారణంతోనే గాలికొదిలేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 టీఎంసీల తరలింపు, 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1983లో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు మంజూరైందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఎల్బీసీ టన్నెల్-1, టన్నెల్-2 పనులను ప్రారంభించారని చెప్పుకొచ్చారు. రూ.1968 కోట్లతో టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఈ దేశంలోనే తొలిసారిగా ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు టన్నెల్ బోర్ మిషన్‌ని ఉపయోగించారని వివరించారు. 2014 వరకు కిలోమీటరు వరకు టన్నెల్ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కేసీఆర్ హయాంలోని పదేళ్లలో పది కిలోమీటర్ల వరకు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో గ్రావిటీ ద్వారా నల్గొండకు నీళ్లు తీసుకెళ్లాలనుకుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలో 40 కిలోమీటర్ల టన్నెల్ ఎక్కడా లేదని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణకు ఆ రికార్డు దక్కుతుందని ఉద్ఘాటించారు. ఆనాడు రూ.2 వేల కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తయ్యేదని స్పష్టం చేశారు. ఇప్పుడు పెరిగిన అంచనాలతో రూ.4600 కోట్ల మేర ఖర్చవుతోందని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడమే కాదని.. కృష్ణా నదిపై ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పదేళ్లలో రూ.1.86 లక్షల కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చారని ఫైర్ అయ్యారు. అందులో రూ.1.5 లక్షల కోట్లు కాళేశ్వరం కోసమే ఖర్చు చేశారని మండిపడ్డారు. కృష్ణాలో తెలంగాణ వాటాని మనం తీసుకోకపోవడం వల్ల ఆ నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతోందని చెప్పుకొచ్చారు. 299 టీఎంసీలు చాలని ఆనాడు హరీశ్‌రావు సంతకం పెట్టి వచ్చారని ధ్వజమెత్తారు. తెలంగాణ వాటా మనకు దక్కాల్సిందేనని ట్రిబ్యునల్‌లో ఈ విషయంపై తాము వాదనలు వినిపిస్తూ ఒక కొలిక్కి తీసుకొస్తున్నామని వివరించారు. ఇంత తక్కువ ఖర్చుతో 30 టీఎంసీల నీటిని తీసుకెళ్లే ప్రాజెక్టు దేశంలో ఎక్కడా లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టామని తెలిపారు. అయితే, ఈ పనుల నేపథ్యంలో దురదృష్టవశాత్తూ 8 మంది కార్మికులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బాధ ఉన్నా.. ఆ కుటుంబాలను ఆదుకుని పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆర్మీలో ఉన్న పరిచయాలతో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముంపునకు గురవుతున్న మర్లపాడు, కేశ్యతండా, నక్కలగండి తండా ప్రజలను ఆదుకుని, డిసెంబర్ 31వ తేదీలోగా సమస్యలని పరిష్కరిస్తామని మాటిచ్చారు. ఇప్పుడు కాకపోతే ఈ ప్రాజెక్టును ఇంకెప్పుడూ పూర్తి చేసుకోలేమని చెప్పుకొచ్చారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా పరిష్కరించి ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసుకోకపోతే నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలకు తీరని నష్టం కలుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పత్తి కొనుగోళ్లలతో సీసీఐ నిబంధనలు మార్చాలి

## కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరావు లేఖ



**హైదరాబాద్, నవంబర్ 3:** పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న సీసీఐ కొత్త నిబంధన నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ రాశారు. సాధారణంగా ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తుండగా.. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ఇచ్చిందని ఆ లేఖలో ప్రస్తావించారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది. తేమ శాతం విషయంలో 20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయాలి. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని మంత్రి తుమ్మల కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# చేవెళ్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



మొదటి పేజీ తరువాయి

దామోదర రాజనర్సింహ వెల్లడించారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. టీఎస్ 34 టీఏ 6354 నంబరు గల ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తాండూరులో ఉదయం 4.40 గంటలకు బస్సు బయల్దేరింది. అక్కడ 30 మందికి పైగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు ఎక్కారు. మొత్తంపై బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో చదువుతున్నట్లు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి.. తిరిగి నగరానికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఈ ఘటనతో చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులతో పాటు బస్సు కండక్టర్ రాధను పోలీసులు రక్షించారు. కండక్టర్‌కు గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌పైకి జేసీబీ ఎక్కడంతో ఆయన ఎడమ కాలికి గాయమైంది. సీఐను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ కొనడంతో బస్సులోకి టిప్పర్ దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంజరిగినప్పుడు బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగటంతో సీట్లలోనే వీరు ఇరుక్కుపోయారు. టిప్పర్ లోని కంకర బస్సులో పడడంతో ముందు వరుసలో ఉన్న 5 సీట్లు డ్యామేజ్ అయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఇప్పటికే ఈ ప్రమాదంలో బస్సులో ఇరుక్కుపోయి.. గాయపడిన 15 మందిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గురైన బస్సు తాండూరు నుండి హైదరాబాద్ వెళ్తుండగా చేవెళ్ల మండలం మిర్జాగూడ దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇటీవల జరిగిన కర్నూల్ బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనం అయిన ఘటన మరువకముందే.. ఈ ఘటన జరగడం రాష్ట్రంలో విషాదాన్ని నింపింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద దృశ్యాలు పలు హృదయాలను కలిచివేస్తున్నాయి. వాహనాలు వేగంగా ఒకదానికొకటి ఢీ కొనడంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది మృతి చెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లు సహా 10 మంది పురుషులు, 9 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. ఘటన సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలు చేయడం గుండెను పిండేసేవిగా ఉన్నాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు.



### ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

చేవెళ్ల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనపై దిగ్భ్రాంతి చెందారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని రేవంత్ రెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారందరినీ వెంటనే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని డీజీపీలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు వెంటనే ప్రమాద సంఘటనకు చేరుకోవాలని పేర్కొన్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సీఎం సూచించారు. ప్రమాదంపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చేవెళ్ళలో జరిగిన రోడ్డు ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డవారికి తగిన వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మృతులకు మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

### బస్సు ప్రమాద ఘటనపై కేసీఆర్ దిగ్భ్రాంతి

బస్సు ప్రమాద ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటించారు. మరణించిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ స్టేజి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో 20 మంది ప్రయాణికులు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటం పట్ల ఆయన సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సాయం అందించాలని, మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేవెళ్ల ఘోర రోడ్డు ప్రమాదంలో 20 మందికి పైగా మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు ప్రభుత్వం వెంటనే మెరుగైన వైద్యం అందించాలని.. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

### చంద్రబాబు, లోకేశ్ తీవ్ర సంతాపం

**అమరావతి,నవంబర్3:** రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తమను కలచివేసిందన్నారు. ప్రమాదంపై స్పందిస్తూ... మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ ప్రమాదం తీవ్రంగా కలిచివేసిందని.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం, మంత్రి తెలిపారు. 'తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికుల మృతి తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు.

# ప్రమాద ఘటనపై ప్రజల ఆగ్రహం

## ఎమ్మెల్యే కాలె యాదయ్యను నిలదీసిన జనం



**రంగారెడ్డి, నవంబర్ 3:** చేవెళ్ల మండలంలో భారీ రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే కాలయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే కాలె యాదయ్యకు నిరసన సెగ తగిలింది. బస్సు ప్రమాదం జరిగిన చాలా సమయం తరువాత ఎమ్మెల్యే ఘటనా స్థలానికి చేరుకోవడంతో.. ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనులు ఎందుకు చేపట్టడం లేదని ఎమ్మెల్యేను నిలదీశారు. అనేకసార్లు రోడ్డు విస్తరణ చేయాలని చెప్పినా నిరక్ష్యం చేశారని స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. స్థానికులు నిరసన తెలపడంతో ఘటన స్థలం నుంచి ఎమ్మెల్యే కాలె యాదయ్య వెళ్లిపోయారు. ఈ రోడ్డు ప్రమాదం హృదయాలను కలిచివేస్తుంది. బస్సు, టిప్పర్ వేగంగా ఒకదానికొకటి ఢీ కొనడంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది మృతి చెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లు సహా 10 మంది పురుషులు, 9 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. ఘటన సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలు చేయడం గుండెను పిండేసేవిగా ఉన్నాయి. పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రమాదంలో దుర్మరణం

## ఎల్లయ్యగౌడ్ కుటుంబంలో తీవ్ర విషాదం



**రంగారెడ్డి, నవంబర్ 3:** రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు ఈ ప్రమాదంలో మృతిచెందారు. అక్కాచెల్లెళ్లు తనూష, సాయి ప్రియ, నందిని మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలలో చదువుతున్న ముగ్గురూ.. గత నెల 15న జరిగిన ఓ పెళ్లివేడుకలో సందడిగా గడిపారు. తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎల్లయ్యగౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తూ పిల్లల్ని చదివించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఒక కుమార్తెకు వివాహం కాగా.. మిగిలిన ముగ్గురు కుమార్తెలు సోమరవాం జరిగిన రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలరెడ్డి అనే యువతి కూడా ఇదే ప్రమాదంలో చనిపోయారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో అఖిల తల్లి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనాస్థలానికి వచ్చి బోరున విలపించారు.

# అంతా క్షణాల్లో జరిగిపోయి

## బస్సు ప్రమాద ఘటనపై కండక్టర్ రాధ

**రంగారెడ్డి, నవంబరు 3:** చేవెళ్ల బస్సు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ బస్సు కండక్టర్ రాధ ఆ భయానక ఘటనను కన్నీళ్లతో గుర్తుచేసుకున్నారు. కండక్టర్ రాధ మాట్లాడుతూ.. అంతా క్షణాల్లో జరిగిపోయిందన్నారు. టిప్పర్ చాలా వేగంగా వస్తున్నదని నేను, మా డ్రైవర్ గమనించాము. డ్రైవర్ బస్సును కిందకు తిప్పే ప్రయత్నం చేశాడు.. అలా చేయకపోయి ఉంటే ఇంకా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయేవారని చెప్పారు. చిట్టేపల్లి దగ్గర ఒక మహిళ బస్సులో ఎక్కింది. వికారాబాద్ దగ్గర ముగ్గురు పోలీసులు ఎక్కారు, తరువాత వారు దిగిపోయారు. అందరూ సంతోషంగా తమ పనులకెళ్లడానికి బయల్దేరారు. ఒక్క క్షణంలోనే అంతా ఛిద్రం అయిపోయింది. ఆ తర్వాత ఏమైందో గుర్తులేదని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే వెనుక వస్తున్న వాహనాలు, జేసీబీ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొన్నాయని, బస్సు, టిప్పర్ వాహనాలను పక్కకు తొలగించి గాయపడిన వారిని బయటకు తీయడం జరిగినట్లు రాధ వివరించారు.

# రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

## మృతుల కుటుంబాలకు 2లక్షల సాయం ప్రకటన

**న్యూఢిల్లీ, నవంబరు 3:** తెలంగాణలోని చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

04-11-25 Samayam_Layout 1 11/4/2025 1:41 AM Page 3



# స్పీడ్ కంట్రోల్ అమలుపై దృష్టి సారించాలి

- చేవెళ్ల ప్రమాదంలో ఇరుకు రోడ్డు కూడా ఓ కారణం
- అతివేగం కూడా ప్రమాదాలకు కారణం అవుతోంది
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్,నవంబరు 3:** చేవెళ్ల వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో రెండు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ.. ఇరుకు రోడ్డు, డివైడర్ లేకపోవడం ప్రమాదానికి ఒక కారణంగా తోస్తున్నదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రమాద. తీవ్రత కూడా అధికంగా ఉందన్నారు. అలాగే వాహనాల స్పీడ్ లాక్ ఎంత వరకు అమలవుతుందో చూడాలని అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బస్సు దుర్ఘటన నేపథ్యంలో తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వరుస ప్రమాదాలు, నివారణా చర్యలపై జూమ్ వేదికగా నిర్వహించిన ఈ కీలక భేటీలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి , జేటీసీలు, డీటీసీలు, ఇతర రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలి. రవాణాశాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీరియస్‌గా, క్రియాశీలంగా ఉండాలి. లారీలు ఇసుక, డస్టును తరలిస్తే.. టార్పాలిన్లు కప్పి ఉంచాలి. రైతులు ధాన్యం తరలింపు వాహనాలపై వేధింపులకు పాల్పడొద్దు. వాణిజ్య, సరుకు రవాణా, ప్రయాణికుల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. ఘటన జరిగినప్పుడే దాడులు చేయడం కాదు.. నిరంతరం కార్యాచరణ ప్రణాళిక ఉండేలా కఠినంగా వ్యవహరించాలి. రవాణాశాఖ పట్ల ప్రజలు, ప్రభుత్వంలో గౌరవం పెంపొందించేలా ఉద్యోగులు పనిచేయాలి. సమర్థంగా పనిచేయండి.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ప్రతి జిల్లాలో కఠినంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చు. డీటీసీ, ఆర్టీవోలు ఇతర రవాణా శాఖ అధికారులు ఒక్కో జిల్లాలో మూడు బృందాలుగా ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షించాలి. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులు, అందులో కార్గో సరుకులు తరలిస్తే కఠినంగా వ్యవహరించండి. స్కూల్ బస్ ఫిట్‌నెస్, హైర్ బస్ ఫిట్‌నెస్, ట్రక్కులు, టిప్పర్‌లు, లారీలు.. వాటి ఫిట్‌నెస్ పర్మిట్‌లపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. రాబోయే రోడ్డు భద్రతా మాసంలో మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు

- 700 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం అనుమతి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశాలు

**హైదరాబాద్, నవంబరు 3:** ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం భూసేకరణకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ఎయిర్ పోర్టు కోసం భూసేకరణ చేయాలని ఆదేశించింది. ఆదిలాబాద్‌లో 700 ఎకరాలు సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రభుత్వం ఆమోదించింది. కేంద్రవిమాన యాన సంస్థ కూడా మొగ్గుచూపింది. రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్‌లలో బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను రానున్న రెండేళ్లలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. భూసేకరణకు సంబంధించిన అన్ని పక్రియలు పూర్తి కాగానే పనులు ప్రారంభించడానికి ఏఏఐ సిద్ధమవుతోంది. ఇప్పటికే వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి కావాల్సిన భూసేకరణ పూర్తి కావొచ్చింది. ఇక్కడ అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆదిలాబాద్‌లోనూ బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం తెలుపడంతో ఏఏఐ రాబోయే రెండేళ్లలో ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ రెండు విమానాశ్రయాలను 2027 జూన్ నాటికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కాగా, స్థానిక పరిస్థితులను బట్టి 2027 డిసెంబరులోగా అందుబాటు లోకి తెస్తామని కేంద్రం గతంలో తెలిపినట్లు సమాచారం. ఈ రెండు విమానాశ్రాయాలకు అనుమతులు ఇచ్చామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా తెలిపారు. దీంతో వేగంగా అడుగులు పడనున్నాయి. ఇది పూర్తయితే మహారాష్ట్ర ప్రజలకు కూడా అందుబాటులోకి రాగలదు.



# గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి రండి

## సీఎం రేవంత్‌రెడ్డికి అక్షయపాత్ర ఫౌండేషన్ ఆహ్వానం

**కొడంగల్ మున్సిపల్, నవంబర్ 3:** కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నా భోజనం అందించేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్ ముందుకొచ్చింది. అక్షయపాత్ర పౌండేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నవంబర్ 14వ తేదీన కొడంగల్ లో నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నా భోజనం అందించేందుకు వీలుగా కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో అక్షయ-పాత్ర ఫౌండేషన్ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ నిర్మించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నా భోజనానికి ఒక్కో విద్యార్థికి రూ.7 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. నాణ్యమైన భోజనం తయారు చేసి అందించేందుకు అక్షయ ఫౌండేషన్ దాదాపు రూ.25 వరకు ఖర్చు పెడుతుంది.ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును అక్షయ పాత్ర ఫౌండేషన్ భరిస్తుంది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధుల సాయంతో ఈ పథకం అమలుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ అందించే పథకం విజయవంతంగా అమలవుతుంది. 312 పాఠశాలల్లో దాదాపు 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయాన్నే అల్పాహారం అందిస్తున్నారు.అన్ని గ్రామాల్లో పిల్లలు, తల్లిదండ్రుల నుంచి ఈ పథకానికి మంచి స్పందన వచ్చింది. ఈ పథకం దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.



# ధర్మపురి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

## గోదావరి పుష్కరాలకు సకల ఏర్పాట్లు ● మాస్టర్ ప్లాన్ రివ్యూలో మంత్రి కొండా



**హైదరాబాద్, నవంబర్ 3 :** జగిత్యాల జిల్లాకు చెందిన ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు కూడా సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మపురి ఆలయ మాస్టర్ ప్లాన్ పై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రివ్యూ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంటు డైరెక్టర్ హరీష్, డిపార్టుమెంటు ఉన్నతాధికారులు, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వందలాది సంవత్సరాలు చరిత్ర గల ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమశాస్త్రం, వేద పండితులు, స్థానికుల, భక్తులు మనోభావాలకు అనుగుణంగా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురిలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి స్వయంభు మూర్తి, రుషులు, దేవతలు సంచరించిన పవిత్ర ప్రాంతం, ఈ అంశం దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. దాంతోపాటు, 2027 జూలై లో రానున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధర్మపురిలోని గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని మంత్రి ఆదేశించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. మాస్టర్ ప్లాన్ కు అవసరమైన స్థల సేకరణ వివరాలు మంత్రి, అధికారులను అడిగి సంపూర్ణంగా తెలుసుకున్నారు. స్థల పురాణం ఆధారంగా చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం రూ. 50 కోట్లతో చేపట్టే నిర్మాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని చెప్పారు. తన సొంత నియోజకవర్గంలో కొలువై ఉన్న స్వామివారి ఆలయాన్ని విస్తృతంగా అభివృద్ధి పరుస్తున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేకంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

# 85శాతం లోకల్ విద్యార్థులకే

**హైదరాబాద్, నవంబరు 3:** రాష్ట్రంలో మెడికల్ పీజీ విద్య యాజమాన్య కోటాలో 85 శాతం సీట్లు ఇక తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు రెండు జీవోలు జారీ చేసింది. ఈ జీవో కారణంగా ఈ ఏడాది రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 318 మెడికల్ పీజీ, 70 డెంటల్ పీజీ సీట్లు దక్కనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పీజీ వైద్య కాలేజీల్లో 50 శాతం సీట్లను అఖిల భారత కోటాలో, మిగతా 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో స్థానికులతో భర్తీ చేస్తున్నారు. తెలంగాణలో ఉన్న 19 ప్రైవేటు పీజీ మెడికల్ కాలేజీల్లో 1511 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సగం సీట్లను కన్వీనర్ కోటా కింద స్థానికులకు కేటాయిస్తున్నారు. మిగతా సీట్లను ఎంక్యూ1, ఎంక్యూ2 (ఎన్ఆర్ఐ), ఎంక్యూ3 (ఇన్‌స్టిట్యూషనల్) కోటా కింద భర్తీ చేస్తారు. వీటిలో ఎంక్యూ 1 కింద 25 శాతం సీట్లు ఉండగా.. వీటన్నింటిని ఆలిండియా కోటాకే కేటాయించేవారు. అయితే ఎంక్యూ1లోని 85 శాతం సీట్లను స్థానికులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.




# దయనీయంగా పత్తిరైతుల పరిస్థితి

## తేమ పేరుతో మోసం చేస్తున్నారు ● జిల్లా పర్యటనలో కవిత విమర్శలు

**ఆదిలాబాద్, నవంబర్ 3:** రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని.. తేమ పేరిట రైతులను మోసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్య క్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వేరే దిక్కు లేక రైతులు ప్రైవేటుకు అమ్ముకుంటు న్నారని చెప్పారు. తెలంగాణ జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఉండి కూడా రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రచారం ఆపేసి రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. తేమతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధరకు సీసీఐ పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కవిత జాగృతి జనం బాట కార్యక్రమం ఆదిలాబాద్‌కు చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం ఇవాళ ఆమె ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ మేరకు కవితకు సంప్రదాయ వాయిద్యాలు, గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు, తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె ఆదివాసీల, రైతుల సమస్యలపై మాట్లాడారు.

# స్థానిక సంస్థల ఎన్నికల కేసు

## 24కు విచారణ వాయిదా : హైకోర్టు




**హైదరాబాద్, నవంబర్3 :** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేస్తూ అక్టోబర్ 9న ఉత్తర్వులు జారీ చేసి విషయం తెలిసిందే. అయితే, ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే, వాదనల సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాది ఎన్నికల నిర్వహణపై బెంచ్‌కు తమ అభిప్రాయం తెలిపేందుకు మరింత గడువు కావాలని కోరారు. మరోవైపు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా తెలిపింది. దీంతో కేసులో తదుపరి విచారణకు ధర్మాసనం ఈ నెల 24కు వాయిదా వేసింది.

# తుపాకీతో కాల్చుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య

## బెట్టింగ్ గేమ్స్ వ్యసనమే కారణం ● సంగారెడ్డిలో విషాదం



**సంగారెడ్డి, నవంబర్ 3:** సంగారెడ్డి జిల్లా మహబూబ్‌సాగర్ చెరువు కట్ట వద్ద సందీప్ అనే కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. తుపాకీతో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్‌కి చెందిన ఆయన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్సే కారణంగా తెలుస్తోంది. సంగారెడ్డి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ పరితోష్ పంకజ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ ఆడి కానిస్టేబుల్ సందీప్ భారీగా డబ్బులు నష్టపోయినట్లు తెలుస్తోంది. బెట్టింగ్ ఆడేందుకు తన సహచర కానిస్టేబుళ్ల దగ్గర భారీగా అప్పులు చేసినట్లు సమాచారం. అయితే, అప్పుగా ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని సహచర కానిస్టేబుళ్లు ఒత్తిడి చేయడంతో సందీప్ ఆత్మహత్యకు పాల్పడినట్లు వార్తలు వస్తున్నాయి. కానిస్టేబుల్ సందీప్ ఆత్మహత్యపై ఎస్పీ పరితోష్ పంకజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతికి గల కారణాలపై విచారణ చేపట్టనున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.

# నేటి నుంచి పరీక్షలు బహిష్కరణ

## ప్రైవేట్ విద్యా సంస్థల సమాఖ్య మరో కీలక నిర్ణయం

**హైదరాబాద్, నవంబర్3:** ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, బీఈడీ తదితర వృత్తి విద్యా, డిగ్రీ కళాశాలలు బంద్‌కు ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పిలుపునిచ్చింది. తాజాగా సమాఖ్య మరో నిర్ణయం తీసుకుంది. నేటి(మంగళవారం) నుంచి పరీక్షలను బహిష్కరిస్తున్నామని ప్రకటించింది. ఈ నెల 8న హైదరాబాద్‌లో కాలేజీల సిబ్బందితో సమావేశం అవుతున్నట్లు తెలిపింది. ఈ నెల 11 వ తేదీన 10 లక్షల మంది విద్యార్థులతో సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. మా డిమాండ్స్‌ను నెరవేర్చేవరకు బంద్ జరుగుతుందని ప్రైవేట్ విద్యా సంస్థల సమాఖ్య చైర్మన్ రమేష్ బాబు తెలిపారు. బాకాయిల్లో 50 శాతం ఇస్తేనే బంద్ విరమిస్తామని, రూ.5 వేల కోట్లు ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని గత రెండు నెలలుగా ప్రభుత్వాన్ని ప్రైవేట్ విద్యా సంస్థల సమాఖ్య డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వానికి మొత్తం రూ. 9 వేల కోట్ల బకాయిలు ఉన్నాయి. గతంలో జరిగిన చర్చల్లో దీపావళిలోగా రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. అయితే ఇందులో ప్రభుత్వం రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేసింది. మిగతా రూ.900 కోట్లు వెంటనే విడుదల చేయాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం సానుకూల స్పందన లేకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థల సమాఖ్య సమ్మె నోటీసు ఇచ్చింది.

04-11-25 Samayam_Layout 1 11/4/2025 1:41 AM Page 4







సంపాదకీయం

# జూబ్లీహిల్స్ గెలుపోటములతో ఒరిగేదేమిటి?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇప్పుడు దూడు పార్టీలకు సవాల్‌గా మారింది. ఈ రాష్ట్రంలో రెండు పార్టీల పాలన ముచ్చటను ప్రజలు చూశారు. ఇక బిజెపి పాలన ఎలా ఉంటుందో పెద్దగా చెప్పనక్కరలేదు. అయినా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎవరు గెలిచినా పెద్దగా పొడిచేదేమీ లేదు. కాకపోతే రాజకీయ పార్టీలు ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకుంటున్నాయి. దీంతో ఇక్కడ పోటీ ప్రతిష్టాతకంగా మారింది. గెలవాలని కాంగ్రెస్, మళ్లీ గెలవాలని బిఆర్ఎస్, గెలిస్తే సత్తా చాటొచ్చని బిజెపిలు తహతహలాడుతున్నాయి. ఈ ఉప ఎన్నిక ఫలితం తో ప్రజల జీవితాల్లో పెద్దగా మార్పు ఉండదు. అలాగే రాజకీయంగా కూడా పెద్దగా వచ్చే మార్పుల ఏవీ ఉండకపోవచ్చు. ఈ ఉపఎన్నికలో ఇచ్చే తీర్పు మీద యావత్ తెలంగాణ రకరకాలుగా విశ్లేషణలు చేయడానికి ఉపయోగపడుతుంది. ఫలితం తరవాత ఎవరి విశ్లేషణలు వారికి ఉంటాయి. ముఖ్యంగా బిఆర్ఎస్ పదేండ్ల పాలనకు, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న రెండేండ్ల కాంగ్రెస్ పాలనకు మధ్య తేడాను విశ్లేషించే అవకాశం వస్తుంది. అలాగే జూబ్లీహిల్స్ ఓటర్లు విజ్ఞత ప్రదర్శించినా ఈ ముగ్గురిలో ఎవరో ఒకరికి ఓటేయక తప్పదు. తెలంగాణ సమాజం కూడా ఈ ఉప ఎన్ని ఫలితంలో ఏదో జుగుతుందని ఆశించడం లేదు. ఇది కేవలం రాజకీయ పార్టీలు తమ బలాబలాలను విశ్లేషించుకోవడానికి, పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడానికి పనికివస్తుంది. ఈ ఉప ఎన్నిక కేవలం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమైన ఎన్నికగా గుర్తించాలి.. మొత్తం తెలంగాణ రాజకీయాలను మలుపుతిప్పే ఎన్నిక అస్సలు కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ రెండేండ్ల పాలన మీద జూబ్లీహిల్స్ ప్రజల తీర్పు ఉండబోతుందన్న వాదనల్లో నిజం కడా లేదు. ఎందుకంటే అక్కడున్న మూడు పార్టీల్లో ఒకరిని గెలపించక తప్పదు. ప్రభుత్వ విధానాన్ని తెలియజెప్పే ఎన్నికగా అస్సలు చూడడానికి లేదు. పేద, ధనిక, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వం మీద ఆగ్రహం ఉంటేగింటే రోడ్ల మీదికి వచ్చి నిరసన తెలియజేయడం చూస్తున్నాం. అలా నిరసనలు తెలియ చేస్తున్న వారికి ఈ ఎన్నికల్లో ఓటేసే వారికి మధ్య సారూప్యం ఉండదు. ఉపఎన్నికలు లేదా ఇతర ఎన్నికల్లో తమ ఓటు ద్వారా ఒక బలమైన సందేశం ఇచ్చే అవకాశం అన్నది గతం. ఇప్పుడు ప్రజలు కూడా మారారు. ఎవరు డబ్బులు ఇస్తే వారికి ఓటేస్తున్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు, రెండేండ్ల కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న తేడా ఏమిటనే దానిమీద ఈ ఉప ఎన్నిక ఫలితాన్ని చూపి నిర్ణయించలేదం. తెలంగాణ రాజకీయాలపై ఇప్పటికే ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ కొనసాగుతున్నది. కాంగ్రెస్ అయినా, బిజెపి అయినా ప్రజల్ల గణనీయమైన మార్పులు తెచ్చే అవకాశాలు కనిపించడం లేదు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది. దుబరా ఖర్చులతో రాష్ట్రాన్ని దివాలా తీయించారు. అనేక పథకాలతో డబ్బుల పందేరం చేశారు. సంక్షేమం, వ్యవసాయం, విద్యుత్తు సహా అన్ని రంగాల్లో పంపకాల మీద కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారు. తన పాలన కాలంలో తెలంగాణను పూర్తిగా దోపిడీ చేసయడంపైనే ఫోకస్ చేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను గుదిబండగా మార్చారు. డబ్బుల సకాలంలో చెల్లించకపోవడంతో ఇప్పుడు వారు ఆందోళనకు దిగారు. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ వంటి అనేక సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి కంట్రాక్టర్లకు దోఇపెట్టారు. తద్వారా సొంత లాభం చూసుకున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, గురుకుల విద్యాలయాలు, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు, గొర్రెలు, చేప పిల్లల పంపిణీ వంటి పథకాలు దుబరాఅ పథకాలుగా, దోపిడీ పథకాలుగా నిలిచాయి. ఇక ఇవన్నీ గమనించే ప్రజలు బిఆర్ఎస్‌ను దూరం పెట్టారు. కాంగ్రెస్ వచ్చి కూడా పెద్దగా ఒరగబెట్టిందేమీ లేదు. ఆరు గ్యారెంటీల పేరుతో అలవికాని హామీలివ్వడంతో గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు కూడా పెద్దగా ప్రజల జీవితాలను మార్చలేకపోతున్నాయి. అప్పనంగా దోచిపెట్టే నడదు బదిలీ పథకాలతో ఓట్ల వేటలో పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ పేరుతో కాలయాపన చేస్తోంది. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇద్దిర పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకుల విద్యాలయాల నిర్వహణలో ఘోర వైఫల్యాలను చూస్తున్నాం. కాంగ్రెస్ హయాంలో ఆర్థిక శాఖలో బిల్లుల మంజూరు విషయంలో పర్సంటేజీల గురించి కథలు కథలుగా చెప్పుకునే పరిస్థితి వచ్చింది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి నేపథ్యం గురించి పలు విమర్శలు ప్రచారంలో ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి పోటీలో ఉన్నా వారు గెలిచి చేసేదేమీ లేదు. ప్రధానంగా ఈ రెండేండ్ల కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత, అద్భుతంగా నడుస్తున్న కేసీఆర్ పాలనను దూరం చేసుకున్నామనే భావన తెలంగాణ ప్రజల్లో కలుగుతున్నదని, అందువల్ల తమకే మళ్లీ ఓటాయని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఓటర్లు ఇంకా చైతన్యాన్ని ప్రదర్శించి ఓటేయాల్సి ఉంది. ఎవరికి వేసినా ముగ్గురు మాత్రమే కనిపిస్తున్నారు. ఈ మూడు పార్టీలు చెల్లని పార్టీలని తేలిపోయింది. అందువల్ల ఇక్కడ ఎవరు గెలిచినా, ఆయా పార్టీలకు తప్ప ప్రజలకు లాభం లేదు.




# అమెరికా అణ్వస్త్ర ప్రయోగాలు

- సమర్థించుకున్న అధ్యక్షుడు ట్రంప్
- పాక్ కూడా పరీక్షలు చేసిందంటూ వ్యాఖ్యలు





**వాషింగ్టన్, నవంబర్ 3:** మూడు దశాబ్దాల విరామం తర్వాత అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించి ప్రపంచానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త సవాల్ విసిరారు. ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్న అగ్ర రాజ్యాధినేత తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కానీ, వీటి గురించి ఆయా దేశాలు మాట్లాడట్లేదు. మేం అలా కాదు. ఏదైనా బహిరంగంగానే చేస్తాం. దాని గురించి మాట్లాడతాం. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా మేం వాటి జోలికి వెళ్లలేదు. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదు. ఇతర దేశాల మాదిరిగానే మేమూ ఈ పరీక్షలు నిర్వహిస్తాం అని ట్రంప్ వెల్లడించారు. రష్యా, చైనా వద్ద చాలా అణ్వాయుధాలు ఉండి ఉంటాయి. మా దగ్గర అంతకంటే ఎక్కువే ఉన్నాయి. మావద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయొచ్చు. కానీ, అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చించా అని ట్రంప్ తెలిపారు. అమెరికా అణ్వాయుధ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఎప్పుడు, ఎక్కడ ఈ పరీక్షలు నిర్వహించనున్నారన్న విషయాన్ని మాత్రం ట్రంప్ వెల్లడించలేదు. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో ఇటీవల చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ముందు 'ట్రూత్ సోషల్'లో దీనిపై పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణు సామర్థ్యాలను పెంచుకుంటున్నాయి. అణ్వాయుధాల విషయంలో అమెరికా, రష్యా, చైనా ఐదేళ్లలోపు సమాన స్థాయికి చేరుకునే అవకాశముంది. అందుకే మన దేశం మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిన సమయం వచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ చేశానని ట్రంప్ తెలిపారు.

# బార్క్ నకిలీ శాస్త్రవేత్తపై లోతైన విచారణ

## కీలక అంశాలు రాబట్టిన అధికారులు

## సమాచారాన్ని చేరవేసి బాగా సంపాదించిన దుడగుడు



**న్యూఢిల్లీ, నవంబర్ 3:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా కలకలం రేకెత్తిస్తున్న బార్క్ నకిలీ శాస్త్రవేత్త కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బార్క్ శాస్త్రవేత్తనని చెప్పుకుంటున్న నిందితుడు అక్తర్ కుతుబుద్దీన్ హుస్సైన్‌ను ఇటీవల ముంబై పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితుడిది ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ అని పోలీసులు గుర్తించారు. అతడి సోదరుడు అదిల్‌ను ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. హుస్సైన్ సోదరులకు 1995 నుంచే అనుమానాస్పద రీతిలో వివిధ మార్గాల్లో నిధులు అందాయని ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. మొదట్లో లక్షల్లో చెల్లింపులు జరిగాయని, ఆ తరువాత ఇవి కోట్లకు చేరుకున్నాయని కూడా గుర్తించారు. భారత న్యూక్లియర్ వ్యవస్థలకు సంబంధించి సీక్రెట్ సమాచారం చేర వేసినందుకు నిందితులు ఈ డబ్బులు పుచ్చుకున్నట్టు అనుమానిస్తున్నారు. అక్తర్‌కు చెందిన ఓ ప్రైవేటు బ్యాంకు అకౌంట్‌లో అనేక అనుమానాస్పద లావాదేవీలు బయటపడ్డాయి. తానో సైంటిస్టు అని చెప్పుకున్నందుకు అతడిని 2004 దుబాయ్‌ను బహిష్కరించినట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ఝార్ఖండ్‌లో తనకు తెలిసిన వారి ద్వారా ఆ సోదరులు పలు ఫేక్ ఐడీలను కూడా సమకూర్చుకున్నట్టు తెలిసింది. తమ పేరిట ఉన్న పలు బ్యాంకు అకౌంట్లను కూడా వారు క్లోజ్ చేసినట్టు దర్యాప్తులో తేలింది. ఇద్దరికీ ఐఎస్ఐతో లింకు ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులిద్దరూ పాకిస్థాన్‌కు వెళ్లివచ్చినట్టు కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తన ఐడీలు మార్చుకుంటూ అక్తర్ సీక్రెట్ జీవితాన్ని గడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వీటి సాయంతోనే విదేశీ పర్యటనలు చేశాడని అనుమానిస్తున్నారు. అరెస్టు సమయంలో అతడి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్స్‌తో పాటు పాత బ్యాంకు అకౌంట్‌ల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితులకు ఏయే మార్గాల్లో నిధులు వస్తున్నాయో తెలుసుకునేందుకు విస్తృత స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

# రాజస్థాన్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం

తాగి ట్రక్ నడిపిన డ్రైవర్ • ప్రమాదంలో 10మంది దుర్మరణం



**జయపుర, నవంబర్ 3:** వరుస రోడ్డు ప్రమాదాలతో దేశం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. రెండు రోజుల వ్యవధిలో దేశ వ్యాప్తంగా మూడు ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆదివారం రాజస్థాన్‌లోని ఫలోడి జిల్లాలో ఓ టెంపో కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో 18 మంది చనిపోయారు. సోమవారం తెలంగాణ రంగారెడ్డి జిల్లాలో బస్సు ప్రమాదానికి గురైంది. దీంతో 20మంది మృతిచెందగా.. పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ రెండు సంఘటనల నుంచి తేరుకోక ముందే మరో ప్రమాదం సంచలనం సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ ట్రక్ డ్రైవర్ తాగిన మత్తులో బీభత్సం సృష్టించాడు. ట్రక్కుతో ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో 10 మంది వరకూ ప్రాణాలు కోల్పోగా.. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇక, ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రమాదం జరిగిన లోహమండి రోడ్‌లోని ఓ షాపులో రికార్డు అయ్యాయి. ఆ సీసీటీవీ ఫుటేజీ వీడియోలో భీకర దృశ్యాలు ఉన్నాయి. ఆ ట్రక్ అడ్డం వచ్చిన వాహనాన్ని వాయు వేగంతో ఢీకొట్టుకుంటూ వెళ్లి పలువురి ప్రాణాలు తీసింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఓ దారుణమైన విషయం బయటపడింది. ట్రక్ అదుపు తప్పిన తర్వాత ఆ డ్రైవర్ అర కిలోమీటర్ వరకు బ్రేకులు వెయ్యలేదు. అడ్డం వచ్చిన వాహనాలను ఢీకొట్టుకుంటూనే వెళ్లిపోయాడు. పోలీసులు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. అతడ్ని విచారిస్తున్నారు.

# సైబర్ నేరాల పట్ల సుప్రీంకోర్టు ఆందోళన

## బాధితులు సుమారు 3000 కోట్లు కోల్పోవడం దారుణం

## డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిందే



**న్యూఢిల్లీ :** డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చాలా విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం షాక్ వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో బాధితులు సుమారు 3000 కోట్లు కోల్పోవడం పట్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు తమకు తాము భద్రతా సిబ్బందిగా, కోర్టు అధికారులుగా, ప్రభుత్వాధికారులు పరిచయం చేసుకుని బెదిరింపులకు పాల్పడు తున్నారు. ఆడియో, వీడియో కాల్స్‌తో బాధితులను పీడిస్తున్నారు. బాధితులను కాల్స్‌తో బందీలుగా చేసి .. డబ్బులు చెల్లించేలా వత్తిడి తెస్తున్నారు. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, ఉజ్వల్ భుయాన్, జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్టు కేసులపై విచారణ చేపట్టింది. ఈ విషయంలో కోర్టుకు సూచనలు చేసేందుకు అమికస్ క్యూరీని నియమించారు. కేంద్ర హోంశాఖ, సీబీఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. డిజిటల్ అరెస్టుతో బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు సుమారు మూడు వేల కోట్లు వసూల్ చేయడం షాకింగ్‌గా ఉందని, బాధితుల్లో సీనియర్ సిటిజన్లు ఉన్నారని, ఒకవేళ ఇలాంటి కేసుల్లో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జఠిలంగా తయారు అవుతుందని ధర్మాసనం పేర్కొన్నది. జుడిషియల్ ఆదేశాలతో భద్రతా ఏజెన్సీలను బలోపేతం చేయాలని, ఇలాంటి కేసులపై ఉక్కుపాదం మోపాలని కోర్టు పేర్కొన్నది. డిజిటల్ అరెస్టుల కేసులపై నవంబర్ 10వ తేదీ మళ్లీ విచారణ చేపట్టనున్నారు. అమికస్ క్యూరీ ఇచ్చే సూచనల ఆధారంగా కొన్ని ఆదేశాలు ఇవ్వనున్నట్లు కోరింది. సిండికేట్ నేరగాళ్లు ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని సీబీఐ తన రిపోర్టులో చెప్పినట్లు జస్టిస్ కాంత్ పేర్కొన్నారు. కేంద్రం, సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. కేంద్ర హోంశాఖకు చెందిన సైబర్ డివిజన్ ఇలాంటి కేసుల్ని డీల్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హర్యానాకు చెందిన ఓ మహిళ సీజేఐ బీఆర్ గవాయ్‌కి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసును వాదిస్తున్నారు. తప్పుడు కోర్టు ఆదేశాలను చూపిస్తూ నేరగాళ్లు ఫ్రాడ్‌కు పాల్పడినట్లు ఆమె ఆరోపించింది. ఆ వృద్ధ మహిళ నుంచి నేరగాళ్లు కోటికిపైగా లూటీ చేశారు. సీబీఐ, ఈడీ, జుడిషియల్ అధికారులమని చెప్పి ఆడియో, వీడియో కాల్స్‌తో బెదిరించారని ఆమె పేర్కొన్నది. అంబాలాలో ఈ ఘటనపై రెండు కేసులు నమోదు అయ్యాయి.

04-11-25 Samayam_Layout 1 11/4/2025 1:41 AM Page 5



# ఫ్రీ బస్సుల హడావుడి.. భద్రత గాలికి వదిలారా?

- ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464

**దక్షిణాదిలో కొద్ది రోజుల వ్యవధిలోనే జరిగిన కర్నూలు, చేవెళ్ల బస్సు ప్రమాదాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేశాయి. కర్నూలు అగ్నిప్రమాదంలో 19 మంది, చేవెళ్ల ఆర్టీసీ దుర్ఘటనలో 20 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 40 మందికి పైగా అమాయక ప్రజలు మరణించడానికి ప్రధాన కారణం.. ఎన్నికల ముందు హడావుడిగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటికి అనుగుణంగా మౌలిక వసతులను పెంచకపోవడం. ఒకవైపు ఉచిత ప్రయాణాల ఉత్సాహం, మరోవైపు భద్రతా నిబంధనల ఉల్లంఘనల పట్ల అధికారుల ఉదాసీనత.. మొత్తంగా ప్రజల ప్రాణాలను గాలికొదిలేసింది.**







### ప్రైవేటు రవాణా బరితెగింపు..

కర్నూలు అగ్నిప్రమాదం వెనుక ప్రైవేటు ట్రావెల్స్ సంస్థల అడ్డగోలు లాభాపేక్ష ఉంది. యజమాన్యం రవాణా నిబంధనలకు విరుద్ధంగా బస్సును శయన తరగతిగా మార్చడం అనేది నిస్సందేహంగా చట్ట ఉల్లంఘన. వాహనం యొక్క అసలు రూపకల్పన, అనుమతులను మార్చడం అనేది కఠినమైన చట్టపరమైన నేరం. అంతేకాదు, ప్రయాణికుల సామాగ్రి పెట్టే చోట అత్యంత త్వరగా మంటలు అంటుకునే వస్తువులను, ప్రమాదకరమైన బ్యాటరీలను తరలించడం అనేది సంస్థల శిక్షార్హమైన నిర్లక్ష్యానికి నిదర్శనం. ఈ నేరపూరిత చర్య కారణంగానే 19 మంది సజీవ దహనం అయ్యారు. అధికారులు చూసీచూడనట్లు వదిలేసినందుకే ఈ సంస్థలు బరితెగించాయి.

### ఇరుకు రోడ్డుకు రాజకీయ బలి..

చేవెళ్లలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి అత్యం త కీలకమైన కారణం.. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి (ఎన్.హెచ్.) విస్తరణ పనులు నిలిచిపోవడం. దశాబ్దాలుగా ఇరుకుగా ఉన్న ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ నిర్లక్ష్యం ప్రదర్శించాయి. రోడ్డు వెడల్పు చేయాలని పదేపదే డిమాండ్లు వచ్చినా.. ప్రభుత్వ ఆదేశాలను అధికారులు ధిక్కరించారు. ఉదాసీనత, రాజకీయ క్రీడ కారణంగానే పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పో యారు. ఈ ప్రాణ నష్టానికి రోడ్డు మౌలిక సదుపాయాల లోపమే ప్రధాన కారణంగా నిలవడం ప్రభుత్వాల జవాబుదారీతనాన్ని ప్రశ్నిస్తోంది.

### ఆర్టీసీ సంస్థ నియమ ఉల్లంఘన..

ఉచిత ప్రయాణ పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో రద్దీ విపరీతంగా పెరిగింది. అయితే, దానికి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడం గానీ, అదనపు సర్వీసులను నడపడం గానీ ఆర్టీసీ చేయలేదు. చట్టబద్ధంగా 45 ఆసనాలున్న బస్సులో దాదాపు 70 మందికి పైగా ప్రయాణించడం, సీటింగ్ సామర్థ్యం కంటే ఎక్కువ మందిని ఎక్కించుకోవడం ప్రజా రవాణా నియమాలను ఉల్లంఘించడమే. ఈ ఓవర్‌లోడింగ్ కారణంగానే చేవెళ్ల ప్రమాదంలో మరణాల సంఖ్య పెరిగింది. సంక్షేమ పథకాలను అమలు చేసేటప్పుడు, రవాణా భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం అనేది ప్రభుత్వ సంస్థగా ఆర్టీసీకి ఉన్న సామాజిక బాధ్యత. ఆ బాధ్యతను ఆర్టీసీ నిర్వర్తించడంలో విఫలమైంది.

### అధికారులపై క్రిమినల్ చర్యలకు డిమాండ్..

ప్రమాదాలకు కారణమైన రవాణా సంస్థలపై చర్యలు తీసుకోవడంతో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విషయంలో ఏమాత్రం లోపం ఉన్నా, వాటి రిజిస్ట్రేషన్‌ను శాశ్వతంగా రద్దు చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవ హరించి, ప్రజలకు హాని కలిగించిన ప్రభుత్వ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. బాధిత కుటుంబాలకు కేవలం పరిహారం కాదు, భద్రత, న్యాయం కోరుకుం టున్నారు. ఈ ప్రాణ నష్టానికి బాధ్యత వహిస్తూ, అధికారులు, యజమానులపై కఠినమైన చట్టపరమైన శిక్షలు విధించాలి.

### మళ్లీ జరగకూడదు..

ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి. చేవెళ్ల వద్ద నిలిచిపోయిన జాతీయ రహదారి విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. రోడ్డు భద్రతను అత్యంత ముఖ్యమైన ప్రభుత్వ విధానంగా మార్చాలి. ప్రైవేటు సంస్థల అక్రమాలను అరికట్టి, వారి లైసెన్సలను రద్దు చేయాలి. చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా మాత్రమే రవాణా వ్యవస్థలో మార్పు వస్తుంది. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ఏమాత్రం విఫలమైనా.. అది ప్రజాస్వామ్య వైఫల్యంగా పరిగణించాలి. ఈ దుర్ఘటనలు ప్రభుత్వాలకు చివరి హెచ్చరిక కావాలి.

# భారత ఆడబిడ్డలు గెలిచి చూపారు

**వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా**

**బాహుబలి ప్రయోగంతో ఇస్రో ఘనత**

**ఇరువురికి అభినందనలు తెలిపిన మోడీ**

**న్యూఢిల్లీ :** ప్రైవేట్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా వాతావరణం కల్పించేందుకు రూ.లక్ష కోట్ల నిధిని ఉపయోగించనున్నట్లు ప్రధాని మోడీ తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీసీ వన్డే వరల్డ్ కప్ సాధించిన భారత జట్టును, బాహుబలి రాకెట్‌ను విజయవంతంగా నింగిలోకి పంపిన భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమం సైన్స్‌కు సంబంధించిందని.. కానీ తొలుత క్రికెట్‌లో భారత్ సాధించిన అద్భుతమైన విజయం గురించి మాట్లాడుతున్నానన్నారు. భారత మొత్తం తమ జట్టు సాధించిన విషయంతో సంతోషంగా ఉందని.. మహిళల జట్టు తొలి ప్రపంచకప్‌ని సాధించిందని.. ఇందుకు తాను మహిళా జట్టును హృదయపూర్వకంగా అభినందిస్తున్నాన్నారు. విజయాన్ని చూసి గర్విస్తున్నానని.. ఈ విజయం దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఆ తర్వాత భారీ ఉపగ్రహాన్ని అత్యంత బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించినందుకు ఇస్రోను అభినందించారు. భారతదేశం హై రిస్క్, అధిక ప్రభావ పరిశోధన ప్రాజెక్టులకు మద్దతు ఇస్తోందని ప్రధాని తెలిపారు. ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను సైన్స్ అండ్ టెక్నాలజీకి శక్తి కేంద్రంగా ఎదగడానికి ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి తమ ప్రభుత్వం గణనీయ-ంమైన సంస్కరణలను చేపట్టిందన్నారు. ఒక దశాబ్దంలో పరిశోధన వ్యయం రెట్టింపు అయ్యిందని.. మా ప్రభుత్వం ఆర్థిక నియంత్రణ, సముపార్జన విధానంలో గణనీయమైన సంస్కరణలు చేసిందని చెప్పారు. ఇది భారత్ ఆవిష్కరణ పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, వృద్ధి-అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడానికి ప్రభుత్వం అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించిందని తెలిపారు. దశాబ్దం కిందట భారత్‌లో మహిళలు దాఖలు చేసే పేటెంట్ల సంఖ్య ఏటా వంద కంటే తక్కువగా ఉండేదని.. ప్రస్తుతం ఈ సంఖ్య 5వేలకు పెరిగిందన్నారు. భారత్‌లో ÷ుఇఓ విద్యను అభ్యసిస్తున్న వారిలో 43శాతం మంది మహిళలు ఉన్నారని.. ఇది ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ అని ప్రధాని వివరించారు.





# కాంగ్రెస్‌లో అంతర్గత భూకంపం?

## జూబ్లీహిల్స్ ఫలితాలపై సర్వత్రా భయాందోళన!

**సమయం ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తుది నిర్ణయం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి కేవలం ఒక రాజకీయ పరాజయం మాత్రమే కాదని, ఇది ముఖ్యమంత్రి నాయకత్వ పటిమ.. మంత్రిమండలి నిలకడపై అనుమానాలు పెంచే తీవ్ర రాజ్యాంగ అల్లకల్లోలం సృష్టించే ప్రమాదం ఉందని తాజా రాజకీయ పరిశీలనలు ఘాటుగా సూచిస్తున్నాయి. ప్రతికూల ఫలితం వస్తుందనే భయంతో ముఖ్యమంత్రి, తన సొంత మంత్రివర్గంతో ఏకాంతంగా జరిపిన సమావేశ వివరాలు వెల్లడి కావడం, పాలకపక్షంలో రాజ్యాంగ బద్ధమైన సమిష్టి బాధ్యత పూర్తిగా చెదిరిపోయిందనే వాస్తవాన్ని చాటింది. ఒక చిన్న ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర ప్రభుత్వ ఉనికినే ప్రమాదంలోకి నెడుతుందని ముఖ్యమంత్రి స్వయంగా మంత్రులను హెచ్చరించడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పుడు, ఓటర్లను ప్రతికూల పరిణామాల ద్వారా ప్రభావితం చేయాలని చూడటం చట్టబద్ధంగా (న్యాయపరంగా) ప్రశ్నార్థకమైన చర్య.

**ముఖ్యమంత్రిపై సొంత మంత్రుల తిరుగుబాటు ధోరణి పెరగడం, సీనియర్ మంత్రులు ప్రచారానికి దూరంగా ఉండటం, ఈ ఫలితం ద్వారా నాయకత్వ పీడ తొలగిపోతుందని అంతర్గతంగా భావించడం గమనిస్తే, పాలనా యంత్రాంగం, ఐక్యత పూర్తిగా చెదిరిపోయినట్లు అర్థమవుతోంది. ముఖ్యమంత్రి తన సొంత సహచరులపైనే పత్రికల్లో వ్యతిరేక కథనాలు రాయించుకున్నారనే ఆరోపణలు, పరిపాలనాధికారంలో అధికార దుర్వినియోగానికి, మంత్రిమండలి నిర్వహణలో నాయకత్వ లోపానికి నిదర్శనాలు. ఒకవైపు నేర చరిత్ర ఉన్న అభ్యర్థి పోటీ, మరోవైపు 35వేల దొంగ ఓట్లపై ఆధారపడటం అనే ఆరోపణలు, ఈ ఎన్నికను కేవలం రాజకీయ పోరుగా కాకుండా, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 ప్రకారం చట్టవిరుద్ధమైన చర్యల కోణం నుంచి భారత ఎన్నికల సంఘం అత్యంత కీలకంగా పరిశోధించాల్సిన స్థితికి చేర్చాయి. జూబ్లీహిల్స్ ఫలితం కేవలం ఒక శాసనసభ స్థానం కోసమే కాదని, రాష్ట్రంలో సుస్థిర పాలన, ప్రజా విశ్వాసం యొక్క భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన మలుపు అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.**



2-11-25 Samayam_Layout 1 11/3/2025 9:55 PM Page 6



# సన్నబియ్యం పంపిణీ ఘనత రేవంత్ రెడ్డిదే



**రాయపోల్,నవంబర్2:** :దేశంలో మొట్టమొదట సారిగా ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పథకాన్ని రాష్ట్రంలో ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండారీ స్వామి అన్నారు.సోమవారం రాయపోల్ మండలం రాం సాగర్ గ్రామం రేషన్ దుకాణలో ప్రత్యేకంగా తయారు చేసిన జ్యుట్ బ్యాగులలో సన్న బియ్యం బ్యాగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరాష్ట్రంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద కుటుంబాలకు సన్న బియ్యం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో లేని పథకాన్ని సీఎం రేవంత్ అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు పేదల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం అనే



**రాయపోల్,నవంబర్ 2:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని రాయపోల్ మండల వీర నగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పాపని ఆంజనేయులు అన్నారు. ఆదివారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్ దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ మైనార్టీ ఇన్ఫర్మేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మహమ్మద్ ఫాసిముద్దీన్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవీన్ యాదవ్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్నింటిని కచ్చితంగా అమలుచేసి తీరుతుందని దీంతో ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో గుంటి నర్సింలు,దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సుహాస్ మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



**హైదరాబాద్, క్రీడాప్రతినిధి, నవంబర్ 3:** సికింద్రాబాద్ ఆర్.ఆర్.సి. ఇండోర్ బ్యాడ్మింటన్ అకాడమీలో గత నాలుగు రోజులుగ జరిగిన "సుహాస్ మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025" క్రీడా ఉత్సాహం నిండుగా సాగింది. రాష్ట్రంలోని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు వారి సత్తా చాటారు. ఈ టోర్నమెంట్‌కు దస్పల్లా హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి. వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెమెంటోలు అందజేశారు. క్రీడా ప్రోత్సాహకుడు జగదీప్ అతిథి గౌరవం స్వీకరించారు. టోర్నమెంట్‌ను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.సి.ఎస్.రావు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో క్రీడాకారుల మధ్య ఉత్కంఠభరిత పోటీలు జరిగాయి. ఆటగాళ్లు స్మాష్‌లు, నెట్ డ్రాప్‌లు, రిటర్న్ షాట్లతో ప్రేక్షకులను అలరించారు. ప్రతి మ్యాచ్‌లో స్కోర్లు సమానంగా సాగడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. సుహాస్ స్మారకార్థంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్ షటిల్ అభిమానుల్లో విశేష స్పందన రేపగా, యువ క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బ్యాడ్మింటన్ వేదిక మరోసారి ప్రతిభావంతులైన ఆటగాళ్లకు వేదికగా నిలిచింది. అంతకుముందు బ్యాట్ సభ్యులు అంతకుముందు బ్యాట్ సభ్యులు లక్ష్మణ్, యు వి ఎన్ బాబు, వంశీ శ్రీనివాసరావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ తండ్రి చిత్రపటానికి వైఎస్సార్సీపీ నేత నివాళి



**నేరేడ్మెట్, నవంబర్ 3 :** మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు గౌ. తన్నీరు హరీష్ రావు గారి తండ్రి సత్యనారాయణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయనకు వైఎస్సార్సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా, మల్కాజిగిరి సీనియర్ నాయకుడు పంజా హరినాథ్ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం హరీష్‌రావు కుటుంబ సభ్యులకు ఆత్మీయ పరామర్శలు తెలిపారు.

# నవీన్ గెలుపు జూబ్లీహిల్స్ అభివృద్ధిలో కీలక మలుపు..

- పదేళ్లలో జరగని అభివృద్ధి
- రెండేళ్లలో చేసి చూపిస్తున్నాం.



**వరంగల్ నవంబర్ 3. (సమయం న్యూస్) :** కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం..బీఆర్ఎస్,బీజేపీ పార్టీలు రెండు తెలంగాణ అభివృద్ధి నిరోధకులు..జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బోరబండ డివిజన్ బంజారా నగర్, స్వరాజ్ నగర్ ఇంటింటి ప్రచారం చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డబోరబండ,జూబ్లీహిల్స్, హైదరాబాద్. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో బోరబండ డివిజన్ బంజార నగర్,స్వరాజ్ నగర్ లలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెట్టిందని తెలిపారు. నవీన్ గెలుపుతో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊపు వస్తుందని ఆయన పేర్కొన్నారు.

పదేళ్లలో జరగని అభివృద్ధిని కేవలం రెండేళ్లలో చేసి చూపుతున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోంది అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే శక్తులుగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజల మద్దతుతో జూబ్లీహిల్స్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.నవంబర్ 11 తేదీన జరిగే ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ని గెలిపించాలని కోరారు.ఈ ప్రచారంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్ రావు ,మాజీ కార్పొరేటర్ బోడ డిన్న,వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు పరమేష్ నాయకులు సందీప్, కాలేబ్, జగ్జీవన్,సమీర్,సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య వృత్తి మానవతా సేవకు ప్రతీక

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**భద్రాద్రి కొత్తగూడెం , నవంబర్ 3 ( సమయం న్యూస్ )** వైద్య వృత్తి మానవతా సేవకు ప్రతీక, విద్యార్థులు నిబద్ధతతో సమాజానికి సేవ చేయాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలోనూతన వైద్య విద్యార్థులు (ఎంబీబీఎస్ ) వృత్తిలో అడుగుపెట్టిన సందర్భంగా వైట్ కోట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైద్య వృత్తి మానవతా సేవకు ప్రతీక అని, ఇది కేవలం ఉద్యోగం కాదు ఇది సమాజానికి అంకితమైన పవిత్ర బాధ్యత అన్నారు. వైద్య విద్యార్థులు రోగుల పట్ల కరుణ, సహానుభూతి, అంకితభావం కలిగి పనిచేయాలి అని తెలిపారు. మీ చేతుల్లో సమాజ ఆరోగ్య భవిష్యత్తు ఉంటుందని, అత్యున్నత వైద్య నైతిక ప్రమాణాలను పాటిస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి వైద్యుడి ధర్మం అని అన్నారు .గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణలో యువ వైద్యుల పాత్ర ఎంతో కీలకం అన్నారు. మీరు రాబోయే రోజుల్లో దేశ వైద్య రంగానికి మూల స్తంభాలు అని, ఈ దశలోనే మీరు క్రమశిక్షణ, సమయపాలన, మానవతా దృక్పథం, ప్రజల పట్ల బాధ్యత వంటి విలు వలను ఆచరించాలి అని నూతన విద్యార్థులకు సూచించారు. వైద్యునిగా సమాజానికి మీరు చేసే సేవే మీ గొప్పతనం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రోగులు అందరికీ గౌరవం ఇవ్వండి. ఈ వైట్ కోట్ కేవలం వస్త్రం కాదు ఇది నైతికత, సేవ, నిబద్ధతలకు ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు వైద్య నైతిక ప్రమాణాల పట్ల నిబద్ధత వ్యక్తం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. 150 మంది నూతన వైద్య విద్యార్థులకు కలెక్టర్ చేతులు మీదుగా తెల్లకోటును అందజేశారు.ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి రావు, కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ రాధామోహన్, వైద్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- దళారి వ్యవస్థ నిర్మూలనకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.
- డిఆర్డిఏ-డిఆర్డిఓ, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి.



**వరంగల్ నవంబర్ 3. (సమయం న్యూస్) :** పర్వతగిరి:- దళారి వ్యవస్థ నిర్మూలించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని లక్ష్యంతోనే ప్రభుత్వం అన్ని గ్రామాల్లో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అకాల వర్షాల పట్ల రైతులు ఆందోళన చెందకుండా అప్రమత్తము కావాలని డిఆర్డిఏ, డిఆర్డిఓ, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి అన్నారు. సోమవారం పర్వతగిరి మండలంలో అన్నారం రావూరు కల్లెడ పర్వతగిరి మాల్యా తండా గ్రామాల్లో గ్రామైక్య సంఘాల మహిళల చేత నిర్వహించబడుతున్న ఐకెపి (సెర్ప్) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తాసిల్దార్ వెంకటస్వామి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ రామిరెడ్డి మాట్లాడుతూ... బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో పడుతున్న వర్షాలకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హార్వెస్టర్ ఉపయోగించినప్పుడు తాలు మట్టి మొదలగునవి రాకుండా ఆర్పిఎం 18, 20 ఉండేలా ప్రతి రైతు చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేసిన ధాన్యాన్ని తేమశాతం 17 లోపు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తద్వారా రైతులకు నిర్వాహకులకు మిల్లర్ల నుండి ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సదివినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రూర్బన్ ప్రాజెక్టు కింద నిర్మించిన గోదాములను పర్వతగిరి సిబ్బందితో కలిసి డిఆర్డిఓ రాంరెడ్డి సందర్శించి పరిశీలించారు.తాసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్, సెర్ప్- డిఆర్డిఏ ప్రాజెక్ట్ మేనేజర్ దాసు ఎంపీ ఓ శేషు, ఏవో ప్రశాంత్, ఏపిఎం రాజీర్, కిసాన్ మోర్చా నాయకులు బొంపెల్లి దేవేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, మండల సమైక్య అధ్యక్ష కోశాధికారులు స్వప్న ఫరీదా బేగం, సెర్ప్ సీసీలు కొమురయ్య సుధాకర్ దేవేంద్ర ఆయా గ్రామాల స్థానిక అధికారులు, సమైక్య సంఘాల వివో ఏలు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# మైనింగ్, క్వారీ లీజుకు పర్యావరణ అనుమతికి జిల్లా సర్వే నివేదికను ప్రజాభిప్రాయం కోసం ఖమ్మం జిల్లా వెబ్ సైట్ లో అందుబాటు

- గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు రమేష్

**ఖమ్మం, నవంబర్ 3 : ( సమయం న్యూస్ ) :** జిల్లాలో మైనింగ్, క్వారీ లీజుల మంజూరుకు పర్యావరణ అనుమతికి అత్యంత ఆవశ్యకమైన జిల్లా సర్వే నివేదిక ను ప్రజాభిప్రాయం కోసం ఖమ్మం జిల్లా వెబ్ సైట్ లో పొందుపర్చినట్లు ఇంచార్జ్ గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు ఏ. రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, సుప్రీంకోర్టు ల మార్గదర్శకాల మేరకు జిల్లా సర్వే నివేదికను రూపొందించినట్లు సహాయ సంచాలకులు అన్నారు. జిల్లాలో ఉన్న చిన్న తరహా ఖనిజాలకు కొత్తగా క్వారీ లీజుల మంజూరు కావాలన్నా, ప్రస్తుతం నడుస్తున్న క్వారీ లీజుల రెన్యూవల్ కావాలన్నా పర్యావరణ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అధ్యయన సంస్థకు పర్యావరణ అనుమతులు మంజూరుకు ఈ జిల్లా సర్వే నివేదిక ఒక కరదీపిక, రెఫరెన్స్ డాక్యుమెంట్ గా దోహదపడుతుందని అన్నారు.

జిల్లాలోని ఖనిజ వనరులు, క్వారీ లీజులు, భౌగోలిక స్వరూపం, వాతావరణ, శీతోష్ణస్థితి, వర్షాపాతం, వాగులు, వంకలు, అడవులకు సంబంధించి సమస్త సమాచారంతో ఈ నివేదికను ప్రజలకు సమాచారార్థం జిల్లా పోర్టల్ లో ఉంచినట్లు, దీనిపై ఎలాంటి అభిప్రాయాలు వెల్లడించాలనుకున్న 21 రోజుల్లో తెలపాలని, తదుపరి అంతిమ జిల్లా సర్వే నివేదిక రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అధ్యయన సంస్థ (సియా) కు సమర్పించడం జరుగుతుందని గనుల, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

2-11-25 Samayam_Layout 1 11/3/2025 9:55 PM Page 7



# మహిళల రక్షణ, భద్రత కోసమే "షీ" టీమ్‌లు పని చేస్తున్నాయి

## ● పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు










**పరిగి మున్సిపల్(మం)నవంబర్,03(సమయం న్యూస్)** మహిళ రక్షణకు భద్రత కోసమే "షీ" టీమ్ లు పనిచేస్తున్నయని "షీ" టీమ్ పరిగి సబ్ డివిజన్ ఇంచార్జ్ నర్సింహులు అన్నారు. జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సోమవారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణము లోని బ్రిలియంట్ హై స్కూల్ లో పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ మాట్లాడుతూ మహిళలు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 100, 181 ను సంప్రదించాలని అన్నారు. మె-ుబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్ లో మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అదేవిదంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ మానవ అక్రమ రవాణా తోపాటు మద్యపాన నిషేధం అంతే కాకుండా మహిళలు బాలికలు టి-సేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, తదితర అంశాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి సురేష్, ఉపాధ్యాయులతో పాటు "షీ" టీమ్ సభ్యులు శోభ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

# 15న ప్రత్యేక లోక్ అదాలత్

## ● జిల్లా జడ్జి రాజగోపాల్



**ఖమ్మం, నవంబర్ 3: ( సమయం న్యూస్ ):** ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు, రాజీ చేసుకోవాలను కునే వారు దీనిని సద్వినియోగం చేసుకొని , కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ అన్నారు. ఖమ్మం జిల్లా కోర్టులోని న్యాయ సేవ సదన్ లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సోమవా రం పోలీసు, బ్యాంకర్లు, చిట్ ఫండ్ ప్రతినిధులు, అధికారులతో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజ గోపాల్ మాట్లాడుతూ లీగల్ సర్వీస్ అథారిటీ తరపున ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజీ చేసుకోవాలనుకునే క్రిమినల్, ఇతర కేసులకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. యాక్సిడెంట్, భార్యాభర్తల వివాదాలు, చెక్ బౌన్స్ వంటి వివిధ కేసులను లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవచ్చని అన్నారు. ప్రమాద కేసులు లోక్ అదాలత్ లో రాజీ చేసుకుంటే ఒకేసారి పరిహారం అందించడం జరుగు తుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకున్న కేసుల్లో మళ్ళీ ఉన్నత కోర్టులకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదని అన్నారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నవంబర్ 15న జిల్లాలోని అన్ని కోర్టులలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు దీనిని వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఉమ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర రావు, నామినేటెడ్ సభ్యులు న్యాయవాదులు శ్రీనివాసరావు, సంధ్యారాణి, పోలీస్, ఎక్సైజ్, బ్యాంక్ అధికారులు, చిట్ ఫండ్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు లబ్ధి చేకూరేలా నిబంధనలకు లోబడి కొనుగోలు జరపాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల నవంబర్ 3, ( సమయం న్యూస్). :** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేస్తుందని, అధికారులు రైతులకు లబ్ధి చేకూరేలా నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలో గల మహేశ్వరి కాటన్స్ జిన్నింగ్ మిల్లులో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రక్రియను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి షాహబోద్దీన్, మండల తహసిల్దార్ జ్యోత్స్న లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సి సి ఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. 2025- 26 సంవత్సరంలో మద్దతు ధర క్రింద సి.సి.ఐ. కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగవలసి ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఇటీవల వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులలో పత్తి ఉత్పత్తి తక్కువ అయిందని, సి సి ఐ ద్వారా మద్దతు ధరతో రైతుల వద్ద నుండి తేమ శాతం, ఇతర నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. క్రాప్ బుకింగ్ లో నమోదు చేసిన రైతుల నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి సమన్వయంతో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోనికి అనుమతించకూడదని తెలిపారు. పత్తి కొనుగోలుతో పాటు వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో చేపట్టడం జరుగుతుందని, రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరి స్థానిక పాఠశాలలో శ్రమదానం చేసిన ఉపాధ్యాయులు



**వరంగల్ నవంబర్ 3. (సమయం న్యూస్) :** ఈరోజు స్థానిక ఎంపీపీ ఎస్ పర్వతగిరి పాఠశాలలో ఉపాధ్యాయులందరూ శ్రమదానం చేసి పాఠశాలలో ఉన్న కలుపు మొక్కలను పీకివేసి పాఠశాలను పరిశుభ్రంగా చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి పాల్గొని ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు శ్రమ యొక్క విలువ మరియు పని పట్ల గౌరవం కలుగుతుందని, పాఠశాలలు పరిశుభ్రంగా మారుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలోచైర్ పర్సన్ జ్యోతి మరియు ఉపాధ్యాయులు లలితా దేవి ,రామస్వామి ,నవీన్, ప్రసాద్ మరియు కిషన్ పాల్గొన్నారు.

# స్కాలర్షిప్లు వెంటనే విడుదల చేయాలి యు ఎస్ ఎఫ్ ఐ



**వరంగల్ నవంబర్ 3. (సమయం న్యూస్) :** ఈరోజు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కళాశాల యాజమాన్యం ఈరోజు నుంచి చేపట్టే నిరవధిక బందుకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని పోచం మైదాన్ రాణి రుద్రమదేవి జంక్షన్లో నిరసన తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చుక్క ప్రశాంత్, జిల్లా మహేష్ విష్ణువర్ధన్, అరవింద్, సుశీల్, నవ్య తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ ఉపకార వేతనముల దరఖాస్తులు సమర్పించాలి

## ● జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి

**ఖమ్మం, నవంబర్ 3:( సమయం న్యూస్ ) :** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ, ప్రైవేటు, యూనివర్సిటీ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలకు సంబంధించి 2017-18 నుండి 2024-25 సంవత్సరాల వరకు పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించి, ఆయా ప్రిన్సిపాళ్లు దరఖాస్తు ఫారాలను ఈ నెల 20 లోగా కలెక్టరేట్ లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి కార్యాలయం, ఎస్-30, 2వ అంతస్తు నందు సమర్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యూషన్ ఫీజులకు సంబంధించి చాలా దరఖాస్తులు నో-ఫీజు అని ఈ-పాస్ వెబ్ సైట్ లో చూపించడం జరుగుతున్నదని, కళాశాలల యాజమాన్యం సంబంధిత శాఖ సోషల్ వెల్ఫేర్ లో గాని లేదా పియంయు సెంటర్ ను సంప్రదించి సంబంధిత ఫీ-స్ట్రక్చర్ ను ఈ-పాస్ వెబ్ సైట్ లో అప్డేట్ చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి అన్నారు.

ఫీజు స్ట్రక్చర్ ను అప్డేట్ చేసుకొనని కళాశాలలకు ట్యూషన్ ఫీజు రాకపోతే, సంబంధిత కళాశాలల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని, అట్టి వారిపై శాఖాపర చర్యల కోసం పై అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పాఠశాల్లో మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలి

## ● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



**ఖమ్మం, నవంబర్ 3: ( సమయం న్యూస్ ) :** పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం విద్యా శాఖపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ లతో, మున్సిపల్ కమీషనర్ లతో, విద్యా శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక పారిశుద్ద్య డ్రైవ్ చేపట్టామని, ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణాన్ని కూడా శుభ్రం చేసుకోవాలని అన్నారు. పీఎం శ్రీ స్కూల్స్ మంజూరైన నిధులతో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ సరఫరా, టాయిలెట్స్, త్రాగునీటి సరఫరా వంటి మౌళిక వసతుల కల్పన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎంఓ ప్రవీణ్, మున్సిపల్ కమీషనర్ లు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

2-11-25 Samayam_Layout 1 11/3/2025 9:55 PM Page 8



# శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట లో పాల్గొన్న ఈటెల రాజేందర్



**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 3 :** గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండల్ దండుపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. వారితో పాటు సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, వర్గల్ మండల్ అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ అమ్మవారు ప్రజలందరినీ చక్కగా చూడాలని నల్లపోచమ్మ, ముత్యాలమ్మ విగ్రహాలను ప్రతిష్టించుకొని పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి గ్రామంలో బొడ్రాయిని కూడా సీతాలమ్మ తల్లి అని పూజిస్తాం అని చెప్పారు.భారత సాంప్రదాయం చాలా గొప్పదిని, స్త్రీలను గౌరవించడం మాత్రమే కాదు వారే దేవతలుగా పూజించుకుంటాం అన్నారు. మైసమ్మ, ముత్యాలమ్మ, సీతలమ్మ అందరూ తల్లులే మనలని కాపాడుతారాని చెప్పారు .భుమిని కూడా భూతల్లిగా పూజిస్తాము.అమ్మవారి అనుగ్రహం మనందరి మీదా ఉండాలని కోరుకుంటున్నారాని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఎల్కంటి సురేష్, నాయకులు శ్రీకాంత్, శంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు జంగం యాదగిరి, వేలూరి జగన్ బబ్బురి రవీందర్ గౌడ్ చింతల ఆంజనేయులు బూత్ అధ్యక్షుడు రాజు కృష్ణ క్యారా శ్రీనివాస్ దండుపల్లి గ్రామ ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ విస్తరణ లో బాగంగా ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

- జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్
- నష్ట పరిహారంగా 14 మందికి చెక్కులను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



**కొడంగల్ మున్సిపాలిటీ(మం)నవంబర్,03(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయ విస్తరణ లో బాగంగా ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు చెక్కుల పంపిణి చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.సోమవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయ విస్తరణ లో బాగంగా దేవాలయ అభివృది కి సంబంధించి ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు నష్ట పరిహారంగా 14 మందికి చెక్కులను జిల్లా కలెక్టర్ పంపిణి చేశారు .ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్,తహసీల్దార్ రాంబాబు సంబంధిత అధికారులు,మరియు నందారం ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి లో ఈనెల 15 న లోక్ అదాలత్



**నవంబర్03( సమయం న్యూస్).:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో సంగారెడ్డి కోర్ట్ నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి జి భవాని చంద్ర గారు ఈరోజు న్యాయవాదులతో ఈ నేల 15 వ తేది నా స్పెషల్ లోకదలత్ సందర్భం గా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం నందు న్యాయమూర్తి గారు మాట్లాడుతు,రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు, భార్యాభర్తల చిన్నచిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులు రాజీ చేయదగ్గ కేసులలో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చు అన్నారు. క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్న చిన్న తగాదాలు పడి కేసులు నమోదు జరిగి కోర్టు చుట్టూ తిరుగుతూ తమ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా కోర్టులో తమ తమ పై ఉన్నటువంటి కేసులను రాజీచేసుకుని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలి అన్నారు. మరియు న్యాయవాదులు అందరు సహకారం అందించి ఈ లోకదాలత్ నీ విజయవంతం చేయాలనీ, కక్షి దారులకు పెద్ద మొత్త లో నష్టపరిహారం వచ్చేలా కేసులు పరిష్కరించుకోవాలని తేలిపారు.ఈ సమావేశం నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి.జి.భవాని చంద్ర గారు ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి.సౌజన్య గారు, జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీమతి.ఆర్. అనిత గారు, శ్రీమతి కె. ధన లక్ష్మి గారు, శ్రీమతి దుర్గా రాణి గారు ,బార్ ప్రెసిడెంట్ శ్రీ.విష్ణు వర్ధన్ రెడ్డి గారు,సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు



**నిజామాబాద్, నవంబర్ 03 :** మాక్లూర్ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తో కలిసి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యం విషయమై ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వపరంగా మద్దతు ధర చెల్లిస్తూ కొనుగోలు చేయడం జరుగుతుందని భరోసా కల్పించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా, ట్యాబ్ ఎంట్రీలు సకాలంలో చేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కాగా, రైతుల్లో నమ్మకాన్ని పెంపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో తాము క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. వెంట సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, తహసీల్దార్ శేఖర్ ఉన్నారు.

## మద్యం షాపుల దుకాణల కేటాయింపు పై లక్కీడ్రా.



**ఆదిలాబాద్ నవంబర్03( సమయం న్యూస్). :** జిల్లాలో మిగిలిన మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీ డ్రా సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం ఆరు దుకాణాల కేటాయింపులు ఈ కార్యక్రమంలో పూర్తయ్యాయి. ఎక్సైజ్ పాలసీ%-2025-27 ప్రకారం మిగిలిన 6 షాపులకు టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా లక్కీ డ్రా నిర్వహించారు. ప్రక్రియ మొత్తం ఫోటో, వీడియో రికార్డింగ్‌తో పూర్తి పారదర్శకంగా సాగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా కొనసాగిందన్నారు. డ్రాలో ఎంపికైన వారికి లైసెన్స్ ఫీజు చెల్లింపు సదుపాయాలను వేదికపైనే కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, తగిన పోలీసు బందోబస్తు కూడా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే. రఘు రామ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, జిల్లా అధికారులు, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## జలమండలిలో 14 మంది ఉద్యోగులు పదవీ విరమణ



**హైదరాబాద్ నవంబర్03( సమయం న్యూస్). :** జలమండలిలో 14 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. బోర్డులో వివిధ స్థాయిల్లో పని చేస్తూ రిటైర్ అయిన వీరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాల్ని చెక్కు రూపంలో అందజేశారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో నాణ్యమైన సమయం గడపాలని, జీవితం సంతోషంగా ఉండాలని వారు ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, పీ అండ్ ఏ సీజీఎం సురేష్, జీఎం సరస్వతి, రిటైర్ అయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలు త్వరగా పరిష్కరించాలి.

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్ నగర్ నవంబర్03( సమయం న్యూస్).**



సోమవారం ఐడిఓసీ(కలెక్టరేట్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడం, సమస్యలను నేరుగా విని వెంటనే పరిష్కారం చూపించడం లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజావాణికి వచ్చిన 73 మంది దరఖాస్తుదారులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని దరఖాస్తు పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు దరఖాస్తులను పెండింగ్ లో నుంచకుండా తేరగా పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యత అని ఆమె తెలిపారు. ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా నమోదు చేసి, పరిష్కారం వరకు అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైతే ఫీల్డ్ పరిశీలనలు కూడా చేయాలని సూచించారుఅనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశం లో కలెక్టర్ పలు అంశాలపై సూచనలు చేశారు.ఆయా శాఖల జిల్లా అధికారులు వారికి కేటాయించిన సంక్షేమ వసతి గృహాలు,గురుకుల పాఠశాలలు, కె. జి.బి.వి లను నెల మొదటి వారం లో తనిఖీ చేసి విద్యా ఐ అప్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. వానాకాలం పంట కొనుగోలుకు సంబం ధించి ఐ కె.పి,పి. ఏ .సి ఎస్ ల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కనీస సౌకర్యాల ను,కొనుగోలు కేంద్రాలలో కావలసిన సదుపాయా లుప్లెక్సీ ఏర్పాటు చేసి ప్రారంభించాలని సూచించారు .ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంపై మండల ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకొనని లబ్ధిదారులను రద్దు చేసి వారి స్థానంలో స్థానిక శాసన సభ్యులతోఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించి కొత్త గా పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్మధు సూదన్నాయక్,వివిధఅధికారులు, తదితరులు ఉన్నారు

# శ్రీరామ్ క్లోరోకేం పరిశ్రమపై చట్టపరమైన చర్యలు తీసుకోండి

- డిఆర్వోకు వినతిపత్రం అందించిన సిఐటియు నాయకులు
- సరైన చర్యలు తీసుకోకపోతే పెద్దెత్తున నిరసనలకు హెచ్చరిక
- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె రాజయ్య



**పటాన్ చేరు,జిన్నారం, సెప్టెంబర్ 3(సమయం న్యూస్) :**సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజిపల్లి ప్రాంతంలోని శ్రీరామ్ క్లోరోకేం పరిశ్రమ యజమాన్యం కార్మికులపై కక్షపరమైన, కార్మిక వ్యతిరేక చర్యలు చేపట్టినందుకు పరిశ్రమపై తక్షణ చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డిఆర్ఓ పద్మజారాణికి సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య మాట్లాడుతూ యూనియన్ ఏర్పాటు చేసిన 13 మంది సిబ్బందిని అన్యాయంగా ఏపీలోని ప్లాంటుకు బదిలీ చేసినట్లు, అలాగే యూనియన్ నాయకులను సస్పెండ్ చేసి కొంతవరకు టర్మినేట్ చేసినట్టు ఆరోపించారు. ఇవి ట్రేడ్ యూనియన్ చట్టాలకు విరుద్ధమేనని, వెంటనే బదిలీలు, తొలగింపు,సస్పెండ్లు ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదాయ వృత్తి హక్కుల పట్ల పరిశ్రమ యజమాన్యం చూపుతున్న నిర్లక్ష్యానికి తోడ్పాటుగా కార్మికులపై మెదవు పెట్టే విధంగా బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అవసరమైతే రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు కి సిఐటియు సిద్ధమని హెచ్చరించారు.పరిశ్రమపై పారదర్శక విచారణ నిర్వహించి కార్మిక చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, యూనియన్ కార్యకర్తలపై విధించిన అన్ని ప్రతికూల చర్యలను రద్దుచేయాలని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు .పరిశ్రమ వైఖరి మార్చుకోకపోతే తదుపరి దశలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు భక్తి భావం పెంపొందేందుకు నిలయాలు

- కోటి 35 లక్షల అంచనా వ్యయంతో
- బీరంగూడ అయ్యప్ప స్వామి దేవాలయ భూమి పూజ
- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, సెప్టెంబర్ 3(సమయం న్యూస్) :** నూతన ఆలయాలు మానసిక ప్రశాంతతకు, ప్రజలలో భక్తి భావం పెంపొందేందుకు నిలయాలు అని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం గుట్ట పైన ఒక కోటి 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మించబోతున్న ఆలయానికి, సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, అయ్యప్ప భక్తుల సమక్షంలో వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో నూతన దేవాలయాల నిర్మాణాలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంగా సొంత నిధులతో 200 కు పైగా దేవాలయాలు నిర్మించడం జరిగందని తెలిపారు.అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులందరూవిరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

# షాద్ నగర్ సాంఘిక సంక్షేమ శాఖ కాలేజిని ఆకస్మికంగా సందర్శించిన చిన్నారెడ్డి

- కాలేజీ దుస్థితి, ప్రిన్సిపాల్ వ్యవహారంపై
- సీఎంకు త్వరలో నివేదిక అందిస్తా
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి
- విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన చిన్నారెడ్డి





**షాద్ నగర్ నవంబర్ 03( సమయం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లోని నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల స్థితిగతులపై, ప్రిన్సిపాల్ వ్యవహారంపై సమగ్రంగా నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి త్వరలోనే అందించనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి తెలిపారు.సోమవారం షాద్ నగర్ లోని నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ కాలేజిని చిన్నారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ నిన్న 400 మంది విద్యార్థినిలు ఆందోళనకు దిగిన నేపథ్యంలో చిన్నారెడ్డి గురుకుల కాలేజీని సందర్శించారు.

విద్యార్థినుల పట్ల కళాశాలలో ప్రిన్సిపల్ శైలజ ప్రవర్తించిన తీరును, ఇతర వివరాలు సిబ్బంది, విద్యార్థినులను చిన్నారెడ్డి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. కాలేజీలో విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలేజీ ప్రాంగణం అంతా కలియ తిరిగారు. వాష్ రూమ్స్, తరగతి గదులు అధ్వన్నంగా ఉన్న విషయాన్ని, ఇతర సమస్యలు సీఎంకు ఇచ్చే నివేదికలో ప్రస్తావిస్తానని చిన్నారెడ్డి తెలిపారు.

# కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ హత్య



**ఖమ్మం , నవంబర్ 3 : ( సమయం న్యూస్ ) :**కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఉదయం ఖమ్మం రూరల్ మండలంలోని ముత్తగూడెం గ్రామంలో గుణగంటి నాగమణి ( 48 ) అనే మహిళ హత్యకు గురి అయది. మృతురాలు నాగమణి కుమారుడు ఉమా మహేష్ కు నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామంలో ఉన్న మేనమామ వెంకన్నకుమార్తె అఖిలతో వివాహం జరిగింది. తరచూ కలహాల కారణంగా భార్య భర్తలైన ఉమా మహేష్ , అఖిలలు సంవత్సరం క్రితం విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో పెద్ద మనషుల మధ్య గ్రామంలోనే పంచాయతీ నిర్వహించి , తిరిగి ఇద్దరికీ కాపురానికి పంపించారు. నాలుగు నెలల క్రితం తనకు జ్వరంగాఉందని , అఖిల పుట్టింటికి వెళ్ళింది. ఈ క్రమంలో సోమవారం అఖిల తండ్రి వెంకన్న , అఖిల తమ్ముడు మనోజ్ , వెంకన్న బావమరిది యల్ది వెంకన్న లు ఉమా మహేష్ ఇంటికి వెళ్లి , తన కుమార్తె ను భార్యగా స్వీకరించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన వాగ్వాదంలో ఉమా మహేష్ ను వారు కర్రలు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. దాడిలో తీవ్ర రక్తస్రావమైన ఉమా మహేష్ మధ్యలో అతడి తల్లి నాగమణి రాగా ఆమెపై కూడా దాడికి పాల్పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఖమ్మం రూరల్ సిఐ నాగరాజు సంఘటన స్థలానిక చేరుకొని , ఆమె అమృతదేహాన్ని పోస్టుమార్టం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె కొడుకు ఉమామహేష్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. దాడికి పాల్పడిన వారు ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్లు లొంగిపోయినట్టు తెలుస్తోంది. పోలీసులు దీనిపై విచారణ ప్రారంభించారు.

# ప్రకృతితో సన్నిహితంగా విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్‌లో పాల్గొన్న మాదిరి ప్రిథ్వీరాజ్



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 3(సమయం న్యూస్):** పటాన్‌చెరు జె.పి. ఫార్మ్స్‌లో సేంద్రియ వ్యవసాయ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూరోకిడ్జ్ స్కూల్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా పాల్గొన్నారు. విద్యార్థులు సేంద్రియ పద్ధతుల్లో పంటల పెంపకం, సహజ ఎరువుల వినియోగం, పురుగు నియంత్రణకు ఉపయోగించే ప్రకృతి స్నేహపూర్వక మార్గాలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మాదిరి ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ “భవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయం అత్యంత అవసరం. ఈ తరహా ఫీల్డ్ ట్రిప్‌లు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమను పెంచి, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను అర్థం చేసుకునేలా చేస్తాయి” అని అన్నారు.సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించిన ప్రిథ్వీరాజ్ , ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన స్కూల్ యాజమాన్యం మహేష్ గారిని అభినందించారు. పర్యావరణ చైతన్యం, సుస్థిర అభివృద్ధి దిశగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు.

# కొత్తపల్లిలో వ్యవసాయ యంత్రాల ప్రారంభం

- న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో పనిముట్ల కొనుగోలు



**పటాన్ చెరు, గుమ్మడిదల, సెప్టెంబర్ 3(సమయం న్యూస్):**సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో, న్యూల్యాండ్ కంపెనీ వారి ఆర్థిక సహకారంతో కూరగాయల కలుపు తీయుటకు ఉపయోగించే ఆధునిక యంత్రాలు, వ్యవసాయ పనిముట్లను పటాన్‌చెరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి గజేందర్ రైతులకు కూరగాయల పంటల సాగు, నిర్వహణ, కలుపు తీయుటకు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, కొత్త సాంకేతికతను ఉపయోగించడం ద్వారా రైతులు కృషి వ్యయాలను తగ్గించుకోవడంతోపాటు పంట దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అగ్రో సంస్థ ఏర్పాటుచేసిన రైతు సంఘం అధ్యక్షులు పెండెం ప్రభు తాజా, మాజీ ఉప సర్పంచ్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకలి చంద్రయ్య, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు ఆగం రాజు, నీరుడి నర్సింలు, రైతులు నీరుడి నాగేష్, కుమ్మరి శివ, మన్నే ఆంజనేయులు, నీరుడి కృష్ణ, నీరుడి సత్తయ్య, ఆగం మధు, లక్ష్మాపురం నర్సింలు, లక్ష్మాపురం మల్లేశం, తోలు ఎల్లయ్య, కొక్కొండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య కళాశాలలు కొడంగల్ మండలంలోనే నిర్మించాలని

● పోస్ట్ కార్డ్స్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించిన కేడిపి జెఏసి



**కొడంగల్ మున్సిపాలిటీ(మం)నవంబర్,03(సమయం న్యూస్) :** కేడిపి జేఏసీ ఆధ్వర్యంలో మెడికల్, వెటర్నరీ,సమీకృత గురుకుల పాఠశాలలు,కళాశాలలు శంకుస్థాపన చేసిన స్థలంలోనే నిర్మించాలనే ఉద్దేశంతో విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయ,ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు,వ్యాపార సంస్థలు, విద్యావంతులు, మేధావులు,సామాన్య ప్రజానీకం పోస్ట్ కార్డు ద్వారా తమ యొక్క అభిప్రాయాలను పోస్టు కార్డు రూపంలో మన ఎమ్మెల్యే,రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి తపాలా కార్యాలయం ద్వారా పంపించడం జరిగింది. ఈ సందర్భంగా కేడిపి జేఏసీ కో కన్వీనర్స్ ఎరన్ పల్లి శ్రీనివాస్, యు.రమేష్ బాబు, మాసాని వెంకటయ్యలు మాట్లాడుతూ ప్రపంచాన్ని శాసిస్తున్న విద్యా, వైద్యం మీరు అసెంబ్లీలో చెప్పినట్లు వెనుకబడిన కొడంగల్ ప్రాంతంలోనే నిర్మించాలని ఈ ప్రాంత బిడ్డల మనోభావాలు,అభిప్రాయాలు దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంత ప్రజలు సర్వతోముక అభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా విద్యా, వైద్య కళాశాలలు ఇక్కడనే నిర్మించాలని తద్వారా అన్ని రంగాల్లో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని విద్యా,వైద్య కళాశాలలు ఈ ప్రాంతంలో కడితే మిమ్మల్ని చిరస్థాయిగా కొడంగల్ ప్రాంతం రుణపడి ఉంటుందని గుర్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేడిపి జేఏసీ నాయకులు జి.రమేష్ బాబు, డాక్టర్ నవాజ్,అంజి,మల్కప్ప, వికార్,రుక్నుద్దీన్,శేఖర్,,సాయిలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంట వివరాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ ఏడిఏ శంకర్ రాథోడ్.



**కొడంగల్ మండలం, నవంబర్,03(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని చిట్ల పల్లి గ్రామ పరిధిలో రైతులు పండించిన పంటలను వ్యవసాయ శాఖ ఏడిఏ శంకర్ రాథోడ్ విస్తరణ అధికారి ఐజాక్ హెరాల్డ్ తో కలిసి పరిశీలించారు. వర్షాల కారణంగా పంటల అమ్మకంలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు.రైతులు తప్పకుండా తమ పంట వివరాలు aeo దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు.

పత్తి అమ్మకం లో తేమ చూసుకొని, అలాగే కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ (kapas kisan app లో slot book) చేసుకోవాలని రైతులకు సూచించారు.

# జిల్లాలో సోయాబీన్ కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ నవంబర్( సమయం న్యూస్). :** సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, రైతులకు టోకెన్లు జారీ చేయడం ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమైందని, అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా కార్యక్రమం కొనసాగుతున్నదని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఏఎంసీ ముధోల్, బోరేగావ్ (ముధోల్ మండలం), బాసర ఈ మూడు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1,400 మందికి పైగా రైతులకు టోకెన్లు జారీ చేసినట్లు తెలిపారు. మార్కెటింగ్, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో కొనుగోలు ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, క్రమబద్ధంగా టోకెన్లు పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. రైతుల సౌకర్యార్థం, కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వసతులు, విశ్రాంతి ఏర్పాట్లు కూడా కల్పించామని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో సోయాబీన్ కొనుగోలు నిరంతరంగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# నాణ్యమైన సేవలకు చిరునామా పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి

● నిపుణులైన వైద్యులు.. అత్యాధునిక వసతులు.
● సేవల్లో దేశంలోనే ఏడవ స్థానం.
● ప్రతి వైద్యుడు సేవా దృక్పథంతో పనిచేయాలి..
● సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం..
● పటాన్ చెరు శాస నసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, సెప్టెంబర్ 3 (సమయం న్యూస్) :**ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరెందిన పటాన్ చెరు పట్టణంలో గల టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నాణ్యమైన సేవలకు చిరునామాగా నిలుస్తోందని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో ఆధునికరించడంతో పాటు, రోగులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులను అడిగి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అత్యధిక శాతం నిరుపేదలే వైద్యం కోసం వస్తున్నారని.. సేవా దృక్పథంతో వైద్యం అందిస్తూ వారి మన్ననలు పొందాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి వైద్యులు సిబ్బంది అందించిన సేవల మూలంగానే కేంద్ర ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో పటాన్ చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నాణ్యమైన సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించిందని తెలిపారు. ఇదే దృక్పథంతో మరిన్ని అవార్డులను సాధించాలని కోరారు. ప్రతి సంవత్సరం 1500 కు పైగా ప్రసూతి ఆపరేషన్లు నిర్వహించడంతోపాటు, 2 లక్షలకు పైగా రోగులకు ఔట్ పేషెంట్ విభాగంలో సేవలు అందించడం గర్వనీయమన్నారు. అన్ని విభాగాల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించడంతోపాటు, వివిధ రకాల ల్యాబ్ టెస్టులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను సూపరిండెంట్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు.మరమ్మత్తులకు గురైన ఆక్సిజన్ ప్లాంట్లను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ ద్వారా ప్రతి నెల 33 మంది రోగులు చికిత్స పొందుతున్నారని తెలిపారు.రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను నియమించాలని కోరుతూ అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞాపన చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో మరో అంబులెన్స్ కొనుగోలుకు నిధులు కేటాయిస్తానని తెలి పారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సేవల్లో లోపం ఉండకూడదని ఆదేశించారు. సౌకర్యాలు లేవంటూ రోగులను వేరే ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, ఆర్ఎంవో ప్రవీణ, ఆస్పత్రి సలహా సంఘం సభ్యులు రాములు గౌడ్, కంకర సీనయ్య, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ సత్తా చాటాలి

● పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
● ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ట్రాక్ సూట్ల పంపిణీ



**పటాన్ చెరు, సెప్టెంబర్ 3 (సమయం న్యూస్) :** త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్ర సత్తాను చాటాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల పటాన్ చెరులో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 బాలురు బాలికల కబడ్డీ, అండర్ 17 బాలుర వాలీబాల్ పోటీలలో విజేతలు ఆదరించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు, కోచ్ లకు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్ సూట్లను ఆయన పంపిణీ చేశారు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు రవాణా భత్యం అందించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతహాగా క్రీడాకారుడైన తాను క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గాన్ని కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో పటాన్ చెరు పట్టణంలో వివిధ క్రీడల్లో జాతీయస్థాయి పోటీలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన అందించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డిఎస్పి ప్రభాకర్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, దశరథ్ రెడ్డి, సిఐలు వినాయక రెడ్డి, లాలు నాయక్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారులు పిపి రాథోడ్, నాగేశ్వర్ రావు నాయక్, బండి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42% విద్య, ఉద్యోగాలు

● స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ బిల్లుల తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చు,
● కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి




**కొడంగల్ మున్సిపాలిటీ(మం)నవంబర్,03(సమయం న్యూస్) :** "42% బీసీ రిజర్వేషన్ సాధన సమితి" తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, తగు ప్రాతినిధ్యం, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమని మేము గట్టిగా నమ్ముతున్నాము. మా ఈ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కొడంగల్ తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ గోపిలకు వినతి పత్రం అందించారు. డాక్టర్ కనోజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, అంజిలప్ప, శ్రీహరి, రవి, మహేష్, పాండు, పకీరప్ప, నారాయణ, శ్రీశైలం, వీరేశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే టిఆర్ఆర్



**చేవెళ్ల:నవంబర్,03(సమయం న్యూస్) :** చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద బాధితులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్.టి.రామ్మోహన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న బాధితులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

04-11-25 Samayam_Layout 1 11/4/2025 1:41 AM Page 11



# ఉమెన్ ఇండియా క్రికెటర్స్‌కు బీసీసీఐ భారీ నజరానా

మహిళ క్రికెట్ లో విశ్వ విజేతగా నిలిచిన క్రికెట్ టీమ్ కు రూ. 51 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీ ఇవ్వబోతోంది. ఇంతటి మొత్తాన్ని పురుషుల జట్లకు కూడా ఇప్పటివరకూ బీసీసీఐ ఇవ్వలేదు. అటు, గత ఎడిషన్‌తో పోలిస్తే ఈసారి ఐసీసీ కూడా ప్రైజ్ మనీనీ దాదాపు మూడు రెట్లు పెంచింది. దీంతో మన మహిళా క్రికెటర్లు పండుగ చేసుకోబోతున్నారు. ఇదే కాదు, భారత మహిళల విజయానికి ఇంకా ఎన్నో సంస్థలు భారీగా క్యాష్ రివార్డులు అందించేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ టోర్నీలో విజేత, రన్నరప్, ఇతర జట్ల కోసం మొత్తంగా ఐసీసీ 13.88 మిలియన్ డాలర్ల (రూ.123 కోట్లు) ప్రైజ్ మనీ పూల్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు, వరల్డ్ కప్ టోర్నీతో పోలిస్తే ఇది 297 శాతం ఎక్కువ. ఇక విజేతకు ఇచ్చే ప్రైజ్ మనీ కూడా గతంతో పోలిస్తే 239 శాతం మేర పెరిగింది. 2023 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన పురుష జట్టుకు ఇచ్చిన ప్రైజ్ మనీ కంటే ఇది అధికం. ఇక ఐసీసీ మహిళల ప్రపంచకప్ ఫైనల్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. శఫాలీ వర్మ అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌కు తొలి వరల్డ్‌కప్ టైటిల్ అందించింది. నాకౌట్ దశకు ముందు జట్టులోకి చివరి వేళ చేర్చబడిన శఫాలీ, ఫైనల్‌లో 87 పరుగులు సాధించి, తర్వాత కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. ఆమెతో పాటు దీప్తి శర్మ కూడా అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది.ఫలితంగా భారత్ దీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న తొలి ప్రపంచకప్ ట్రోఫీని గెలుచుకుంది. లారా వోల్వార్డ్ శతకంతో పోరాడిన దక్షిణాఫ్రికా మరోసారి రన్నరప్‌గా ముగిసింది. భారత్ తొలి బ్యాటింగ్‌లో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. శతకం లేకుండా జట్టు సాధించిన మూడవ అతిపెద్ద స్కోరు ఇది. ఓపెనర్ స్మృతి మంధాన హిస్టరీ క్రియేట్ చేసింది. ఫైనల్‌లో చేసిన 45 పరుగులతో మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. ఒక వరల్డ్ కప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించింది. ఆమె ఈ సీజన్‌లో 434 పరుగులు చేసింది. ఇంతకుముందు ఈ రికార్డు లెజెండరీ బ్యాటర్ మిథాలీ రాజ్ పేరిట ఉండేది. 2017 ఎడిషన్‌లో మిథాలీ 409 పరుగులు చేసింది.






## గేమ్‌ఛేంజర్ దీప్తి శర్మ

భారత మహిళా క్రికెట్ జట్టు చిరకాల స్వప్నం సాకారమైంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అద్భుత ప్రదర్శనతో భారత్ తొలిసారిగా మహిళల ప్రపంచకప్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఆదివారం నవీ ముంబయిలో జరిగిన ఫైనల్లో భారత్, దక్షిణాఫ్రికాను ఓడించి సరికొత్త చరిత్ర లిఖించింది.? ఫైనల్‌లో ఆల్?రౌండర్ ఆటతీరుతో రాణించిన దీప్తి శర్మ ఆటను ఎంత మెచ్చుకున్నా తక్కువే అవుతుంది. టోర్నీ మొత్తంలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చి గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. దీప్తి టోర్నమెంట్ మొత్తంలో 215 పరుగులు చేసి, 22 వికెట్లు పడగొట్టింది. ఈ అసాధారణ ప్రదర్శనకు గాను ఆమెకు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' పురస్కారం లభించింది. ఈ క్రమంలోనే ఆల్ రౌండర్ ప్రదర్శనతో దీప్తి కొన్ని అరుదైన రికార్డులను సొంతం చేసుకుంది. పురుషుల వరల్డ్ కప్‌లోనూ సాధ్యం కాని రికార్డును దీప్తి శర్మ సాధించి ప్రపంచ క్రికెట్ యవనికపై కొత్త చరిత్రను లిఖించింది.దీప్తి శర్మ పురుషులు, మహిళల ప్రపంచ కప్‌ల చరిత్రలో ఒకే ఎడిషన్‌లో 200కు పైగా పరుగులు, 20కిపైగా వికెట్లు సాధించిన మొట్టమొదటి క్రీడాకారిణిగా నిలిచింది. దీంతో ప్రపంచ క్రికెట్‌లో సరికొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. బౌలింగ్‌లో దీప్తి ప్రత్యర్థులను ఓ ఆటాడేసింది. కీలకమైన ఫైనల్?లో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఆర్డర్‌ను కూల్చింది. ఏకంగా 5/39 గణాంకాలతో అదరగొట్టింది.దీంతో ప్రపంచ కప్ ఫైనల్లో ఐదు వికెట్లు తీసిన భారత తొలి మహిళగా రికార్డు సృష్టించింది. ఈ టోర్నమెంట్‌లో దీప్తి 22 వికెట్లు తీసి, ప్రపంచకప్ సింగిల్ ఎడిషన్?లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్?గా రికార్డు కొట్టింది. ఈ క్రమంలోనే శుభాంగి కులకర్ణి, నీతూ డేవిడ్ (20 వికెట్లు) రికార్డును బద్దలు కొట్టింది. అలాగే, ఓవరాల్‌గా భారత తరఫున ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన వారిలో జులన్ గోస్వామి (43) తర్వాత 36 వికెట్లతో రెండో స్థానంలో నిలిచింది.ఫైనల్‌లో భారత జట్టు విశ్వవిజేత కావడంలో దీప్తి శర్మ కీలక పాత్ర పోషించింది. ఫైనల్ మ్యాచ్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఒకవైపు స్కోర్‌బోర్డ్‌ను పరిగెట్టిస్తూ మరోవైపు భాగస్వామ్యాలను నిర్మిస్తూ తమ మైండ్‌తో గేమ్ ఆడింది. బ్యాటింగ్‌లో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు జట్టుకు అండగా నిలిచి, 58 పరుగులు చేసి స్కోరు బోర్డును పటిష్టం చేసింది. టోర్నీ మొత్తంలో 215 పరుగులు చేసింది. అందులో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ముఖ్యంగా ఫైనల్లో ఒత్తిడిని తట్టుకొని ఆమె చేసిన 58 పరుగులు ఎంతో అమూల్యమైనవి.టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టులో స్మృతి మంధాన (45), షఫాలీ వర్మ (87) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత, దీప్తి శర్మ (58), రిచా ఘోష్ (34) మెరుపు ఇన్నింగ్స్‌లతో భారత్ 298/7 భారీ స్కోరు సాధించింది. అనంతరం 299 పరుగుల లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (101) అద్భుత సెంచరీతో పోరాడింది. సెమీఫైనల్లో 169 పరుగులు చేసిన వోల్వార్ట్, ఇక్కడ కూడా అదే ఫామ్‌ను కొనసాగించింది. అయితే, ఆమె సెంచరీ సాధించిన వెంటనే దీప్తి శర్మ తన 'గేమ్ ఛేంజింగ్' స్పెల్‌తో వోల్వార్ట్‌ను, ఆనర్ డెర్క్‌సెన్ (37)ను అవుట్ చేసింది. ఈ దెబ్బతో దక్షిణాఫ్రికా 246 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా, భారత జట్టు తమ క్రీడా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, తొలి మహిళల ప్రపంచ కప్ ట్రోఫీని గెలుచుకుంది. ఈ విజయంలో దీప్తి శర్మ ప్రదర్శన చిరస్మరణీయంగా నిలిచింది.

## ప్రపంచ విజేతలపై ప్రశంసల వర్షం

భారత్ ప్రపంచ ఛాంపియన్?గా నిలిచింది. ఫైనల్?లో సౌతాఫ్రికాను ఓడించి సగర్వంగా కప్పును ముద్దాడంది. దీంతో ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళాల జట్టుపై ప్రశంసల జల్లు కురుస్తుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టీమ్?ఇండియాకు అభినందనలు తెలిపారు. మహిళల జట్టు అసమాన ప్రతిభ, అద్వితీయ ప్రదర్శనకు తగిన ఫలితం లభించిందని మోదీ అన్నారు. విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భారత అమ్మాయిలు చరిత్ర సృష్టించారని ఎక్స్ వేదికగా కొనియాడారు. 'మహిళల అసమాన ప్రతిభ, అద్వితీయ ప్రదర్శనకు తగిన ఫలితం లభించింది. ఈ గెలుపు మహిళల క్రికెట్‌ను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళుతుంది. ఫైనల్‌లో గొప్ప నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ప్రదర్శన చేశారు. ప్లేయర్లందరికీ శుభాకాంక్షలు. ఈ చరిత్రాత్మక విజయం భవిష్యత్ తరాలను క్రీడలవైపు మళ్లిస్తుంది' అని మోదీ ట్వీట్ చేశారు. 'టోర్నీ ఆసాంతం ఆటగాళ్లు అసాధారణ సమష్టి కృషి, పట్టుదలను ప్రదర్శించారని మెచ్చుకున్నారు. ఈ చారిత్రాత్మక విజయం భవిష్యత్తు ఛాంపియన్లకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. భారత జట్టుకు శుభాకాంక్షలు' తెలిపిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా. "ఈ విజయం లక్షలాది మంది అమ్మాయిలకు స్ఫూర్తిదాయక మార్గాన్ని సుగమం చేస్తుందన్నారు. ఉమెన్ ఇన్ బ్లూ చరిత్ర సృష్టించింది"-లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. 'అమ్మాయిల తెగువ, పోరాటం భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టాయని, వారు కేవలం ట్రోఫీని మాత్రమే పొందలేదని జాతీయ స్ఫూర్తిని రగిల్చారని ప్రశంసించారు. అమ్మాయిలు కేవలం కప్పును గెలుచుకోవడమే కాదు ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకున్నారని' కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. భారత మహిళా క్రికెట్ ప్రయాణంలో ఇదోక అద్భుతమైన క్షణమని క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ అన్నాడు.దేశంలోని యువతులకు ఈ విజయం ప్రేరణగా నిలుస్తుందన్నారు. నిర్భయంగా, నమ్మకంతో ఆడిన ఆట ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందని స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ అన్నాడు. ప్రశంసలకు వారంతా పూర్తి అర్హులు అని ఈ విజయం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. రెండు దశాబ్దాల కలను హర్మన్‌ప్రీత్ బృందం నిజం చేసిందని భారత మహిళ క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ అన్నారు. చారిత్రాత్మక విజయం సాధించిన భారత జట్టుకు ఐసీసీ ఛైర్మన్ జై షా అభినందనలు తెలిపారు. భారత మహిళల క్రికెట్ ప్రయాణం అద్భుతంగా సాగుతోందన్నారు. విజేతగా నిలిచిన భారత జట్టుకు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అభినందనలు తెలిపారు. హర్మన్ బృందం భారత మహిళ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని మైక్రోసాఫ్ట్ సత్య నాదేళ్ల కొనియాడారు. మ్యాచ్‌ను ఆస్ట్రేలియాలో సిరీస్ ఆడుతున్న భారత పురుషుల జట్టు చాలా ఆసక్తికరంగా వీక్షించింది. కోచ్ గౌతమ్ గంభీర్, పేసర్ బుమ్రా, రింకు సింగ్ తదితరులు మ్యాచ్ చూస్తున్న దృశ్యాన్ని బీసీసీఐ షేర్ చేసుకున్నారు.



## షెఫాలీ వర్మ అరుదైన రికార్డులు

మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 ఫైనల్లో అరుదైన రికార్డును టీమిండియా ఓపెనర్ షఫాలీ వర్మ చేజార్చుకుంది. నవంబర్ 2న నవీ ముంబైలోని డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచులో ఇండియా స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ ఫైనల్‌లో సెంచరీ చేయడంలో విఫలమైంది. అయితే షఫాలీ 87 పరుగులు చేసి మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు తన ఖాతాలో వేసుకుంది. ఫైనల్‌లో సెంచరీ చేసింటే ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రికెటర్ రికార్డు ఆమె ఖాతాలో చేరేది. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. 2017 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో భారత ఓపెనర్ పూనం రౌత్ చేసిన 86 పరుగులే ఇప్పటివరకూ అత్యధికం. తాజాగా షఫాలీ వర్మ 87 పరుగులతో వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచింది. ఈ మ్యాచులో షఫాలీ వర్మ బంతితోనూ అద్భుతం చేసింది. కీలక సమయంలో బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టింది. వరల్డ్ కప్ ఫైనల్లో రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసింది. వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో హాఫ్ సెంచరీ చేసిన యంగెస్ట్ ఉమెన్ బ్యాటర్‌గా షఫాలీ వర్మ రికార్డులు క్రియేట్ చేసింది.భారత విధ్వంసకర ఓపెనర్ షెఫాలీ వర్మ దక్షిణాఫ్రికాతో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో 78 బంతుల్లోనే 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేసింది. షెఫాలీ దూకుడుగా ఆడుతూ ఇండియాకు మంచి ఆరంభం ఇచ్చింది. మరో ఓపెనర్ స్మృతి మంధానాతో కలిసి మొదటి వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. షెఫాలీ తన దూకుడైన బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టింది. ఈ క్రమంలో షఫాలీ.. అయాబోంగా ఖాకా బౌలింగ్‌లో సునే లూస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటైంది.

## భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు

**ట్వీట్ చేసిన టీమిండియా క్రికెటర్ కోహ్లీ**



మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టుపై టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ విజయంతో ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడాడు. ఈ గెలుపుతో ప్రతీ భారతీయుడు గర్వ పడుతున్నాడని, ఈ విజయానికి భారత అమ్మాయిలు పూర్తి అర్హులని పేర్కొన్నాడు. ఈ మేరకు కోహ్లీ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్‌ను షేర్ చేశాడు. ప్రపంచకప్‌తో ఉన్న మహిళల జట్టు ఫొటోను కూడా పంచుకున్నాడు.'భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచారు. మీ ఫియర్‌లెస్ క్రికెట్, ఆత్వ విశ్వాసంతో ప్రతి భారతీయుడి గర్వించేలా చేశారు. మీరు అన్ని ప్రశంసలకు అర్హులు.ఈ క్షణాన్ని పూర్తి స్థాయిలో ఆస్వాదించండి. హర్మన్ సేన అద్భుత ప్రదర్శన కనబర్చింది. జై హింద్.'అని విరాట్ కోహ్లీ ట్వీట్ చేశాడు. విరాట్ కోహ్లీతో పాటు క్రీడా, సినీ, రాజకీయ ప్రముఖులు కూడా భారత విజయాన్ని సోషల్ మీడియా వేదికగా కొనియాడారు.'1983 సంవత్సరం ఒక తరాన్ని పెద్ద కలలు కనడానికి, వాటిని నెరవేర్చుకునేందుకు స్ఫూర్తినిచ్చింది. నేడు మన మహిళల క్రికెట్ అద్భుతమైన విజయాన్ని అందుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న యువతులు బ్యాట్, బాల్ పట్టి మైదానంలో అడుగుపెట్టడానికి, తాము కూడా ఒక రోజు ట్రోఫీని గెలవగలమనే నమ్మకం కలిగిలే ఈ విజయం స్ఫూర్తినిచ్చింది. భారత మహిళల క్రికెట్ ప్రయాణంలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. టీమిండియా చాలా బాగా ఆడింది. దేశం మొత్తం గర్వపడేలా చేసింది.'అని సచిన్ ట్వీట్ చేశాడు. భారత మహిళల జట్టు కేవలం చరిత్ర సృష్టించలేదని, భవిష్యత్తులో ఆడపిల్లలకు స్ఫూర్తినిచ్చే ఒక మహత్తర వారసత్వాన్ని నెలకొల్పారని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు. 'భారత క్రికెట్‌కు ఇదో చారిత్రక ఘట్టం. మన మహిళల జట్టు పట్టుదల, ఓర్పు, విశ్వాసంతో ఏదైనా సాధిస్తుందని ప్రంపంచానికి చూపించారు. వారికి నా అభినందనలు'అని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్వీట్ చేశాడు. 'ఈ జట్టు చూపిన అసాధారణ ధైర్యం, విశ్వాసం అద్భుతం. మీరు దేశం మొత్తాన్ని గర్వపడేలా చేశారు. ఛాంపియన్స్, మీకు హృదయపూర్వక అభినందనలు'అని టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేర్కొన్నాడు.

## యువరాజ్ సింగ్ నా ఆరాధ్య క్రికెటర్

**లెఫ్టార్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి**



దిగ్గజ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తన ఆరాధ్య క్రికెటర్ అని టీమిండియా మహిళల జట్టు లెఫ్టార్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి తెలిపింది. యువరాజ్ సింగ్ కొట్టిన 6 బంతుల్లో 6 సిక్స్‌ల వీడియోను లెక్కలేనన్ని సార్లు చూశానని చెప్పింది. యువరాజ్ సింగ్‌లా సిక్స్‌లు కొట్టడం తన కోరిక అని ఈ కడప అమ్మాయి తన మనసులోని మాటను బయట పెట్టింది. మహిళల వన్డే ప్రపంచకప్ 2025 గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టులో నల్లపు రెడ్డి శ్రీచరణి కీలక సభ్యురాలు. ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ అద్వితీయమైన ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. అత్యుత్తమ ప్రదర్శన(3/41). దీప్తి శర్మ(19) తర్వాత భారత తరఫున సెకండ్ హయ్యెస్ట్ వికెట్ టేకర్‌గా నిలిచింది.ప్రత్యర్థికి పరుగులివ్వకుండా కట్టడి చేయడం శ్రీచరణి ప్రత్యేకత. ఫైనల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పూర్తిగా శ్రీచరణిపైనే ఆధారపడింది. ఒక ఎండ్‌లో శ్రీ చరణితో కట్టడిగా బౌలింగ్ చేయించి.. మరో ఎండ్‌లో వికెట్ల కోసం హర్మన్ ప్రయత్నించింది. సౌతాఫ్రికా బ్యాటర్ బోష్‌ను శ్రీ చరణి డకౌట్‌గా పెవిలియన్ చేర్చిన తీరు అద్భుతం. 21 ఏళ్ల వయసులోనే ఎలాంటి ఒత్తిడి లేకుండా సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేసిన శ్రీ చరణి అందర్నీ ఆశ్చర్యపరిచింది.ఈ టోర్నీ ప్రారంభానికి ముందు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో శ్రీ చరణి తన ఆరాధ్య క్రికెటర్ ఎవరో చెప్పింది. యువరాజ్ సింగ్‌తో పాటు స్మృలి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా తన ఫేవరేట్ క్రికెటర్లని తెలిపింది. 'క్రికెట్‌లో యువరాజ్ సింగ్, స్మృతి మంధాన, హర్మన్, జెమీమా అంటే నాకు చాలా ఇష్టం. యువరాజ్ సింగ్ ఆరు బంతుల్లో ఆరు సిక్సులు కొట్టిన వీడియో అయితే ఇప్పటివరకు ఓ లక్ష సార్లు చూడొచ్చు. ఎప్పటికైనా యువరాజ్ సింగ్‌లా సిక్సర్లు కొట్టాలనేది నా కోరిక. ప్రస్తుతానికైతే బౌలింగ్ పైనే ఫోక్‌స పెట్టాను. జట్టు అవసరానికి తగ్గట్టు బ్యాటింగ్‌లోనూ సత్తా చాటడానికి ప్రయత్నిస్తాను.'అని చెప్పుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్, కడప జిల్లాలోని యర్రంపల్లి గ్రామానికి చెందిన శ్రీచరణి అనూహ్యంగా క్రికెట్‌వైపు అడుగులు వేసింది. ఆమె జీవిత ప్రయాణం గురించి వింటే ప్రపంచకప్ గెలిపించడానికే ఆమె క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుందా అనిపిస్తోంది. శ్రీ చరణి తొలుత ఖోఖోలో జాతీయస్థాయిలో రాణించింది. అథ్లెటిక్స్‌లోనూ అవకాశం అందుకుంది. కానీ పదోతరగతి చదువుతున్న సమయంలో క్రికెట్‌పై ఉన్న మక్కువతో ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకుంది. ముందుగా తన నిర్ణయాన్ని తండ్రి చంద్రశేఖర రెడ్డి, తల్లి రేణుక వ్యతిరేకించారు. కానీ కూతురు పట్టుదల చూసి ఆ దిశగా ప్రోత్సహించారు.

04-11-25 Samayam_Layout 1 11/4/2025 1:41 AM Page 12





# మనశంకర వరప్రసాద్ బిజీ



సంక్రాంతి బరిలో 'మన శంకరవరప్రసాద్‌గారు'గా సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఈ మూవీ షూటింగ్ శరవవేగంగా సాగుతోంది. ఇప్పటికే చాలా పార్ట్ పూ-ర్తయ్యింది. పాటలు కూడా మంచి రెస్పాన్స్ క్రియేట్ చేస్తున్నాయి. ఆయన టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఆదివారం నుంచి హైదరాబాద్‌లో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్రారంభించుకుంది. చిరుతో పాటు టైర్స్ బృందంపై తెరకెక్కిస్తున్న ఈ భారీ పోరాట ఘట్టానికి యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ÷-లక్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందిస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాలో హీరో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.



# కియారా చెప్పేసింది కాస్కోండిక!



అలనాటి అందాల బాలీవుడ్ తార మీనా కుమారి బయోపిక్ కి రంగం సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. సిద్దార్ధ్ పి. మల్హోత్రా ఈ సినిమా బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం స్టోరీ సహా ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగు తున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి ఈ ఏడాదిలోనే పట్టాలెక్కించడానికి రెడీ అవుతున్నారు. అయితే మీనా కుమారి పాత్రలో బాలీవుడ్ నుంచి ఏ నటి రంగంలోకి దిగుతుంది? అన్నది ఇంత వరకూ సరైన స్పష్టత లేదు. తొలుత కృతి సనన్ పేరు తెరపైకి వచ్చింది. అటుపై కియారా అద్వాణీ వెలుగులోకి వచ్చింది. కానీ అధికారికంగా ఎలాంటి కన్ఫర్మేషన్ లేకపోవడంతో నటి ఎవరు? అన్నది క్లారిటీ లేకుండా పోయింది. అటు మేకర్స్ గానీ..ఇటు నటీమణులు గానీ ఎవరూ స్పందించలేదు. తాజాగా ఈ ప్రచారంపై కియారా పూర్తి క్లారిటీ ఇచ్చేసింది. మీనా కుమారి పాత్రలో తానే నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది. %-%కమల్ ఔర్ మీనా%-% టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో మీనా కుమారి భర్త కమల్ పాత్ర ఏ నటుడు పోషిస్తారు? అన్నది ఆసక్తికరం. ఇంత వరకూ ఆ పాత్రకు సంబంధించి ఎంపిక కూడా పూర్తి కాలేదు. కొంత మంది యువ నటుల పేర్లు పరిశీలిస్తున్నారు. ఈ పని మనిహా ప్రీ ప్రొడక్షన్ పనులు పూ-ర్తయ్యాయి.అయితే ఈ సినిమా మాత్రం వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభించాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ లోగా మిగతా పనులు కూడా పూర్తి చేయనున్నారు. ఒక్కసారి మీనా జీవితంలోకి వెళ్తే... బాలీవుడ్లో ట్రాజెడీ క్వీన్ మీనా కుమారి కి పేరు గాంచారు. వృత్తి, వ్యక్తిగత జీవితం తెరిచిన పుస్తకం లాంటిది. నటిగా ఎన్నో క్లాసిక్ హిట్స్ తో తనకంటూ బాలీవుడ్ చరిత్రలో కొన్ని పేజీలు రాసిపెట్టారు.

# మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో: రష్మిక

మహేశ్‌బాబు యవ్వన రహస్యం ఏమిటో తెలుసుకోవాలని ఉందని నటి రష్మిక ఆసక్తిని వ్యక్తం చేసింది. రష్మిక కథానాయికగా రూపొందిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పకులు. దీక్షిత్‌శెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబరు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రష్మిక సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుతం పాన్ ఇండియా ఫిల్మ్స్ చేస్తున్నా. నేరుగా తమిళ మూవీ చేయడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం చాలా వరకూ చర్చల దశలోనే ఉన్నాయి. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చుతుందని భావిస్తున్నా. నాకంటూ కొంతమంది బెస్టీస్ ఉన్నారు. పబ్లిక్‌లో వాళ్ల పేరు చెబితే నన్ను చంపేస్తారని అంటూ సరదాగా కామెంట్ చేశారు. మహేశ్‌బాబులో మీకు నచ్చేది ఏదని అడిగితే.. సర్‌కి ఎప్పటికీ వయసు అయిపోవడం లేదు. పైగా నానాటికీ వయసు తగ్గుతోంది. అది నాకు బాగా ఇష్టం. అదెలా సాధ్యమో నాకు తెలుసుకోవాలని ఉందని చిలిపిగా చెప్పింది. ది గర్ల్‌ఫ్రెండ్, థామా వీటిల్లో ఏ సినిమా చేయటం మీకు అత్యంత కష్టంగా అనిపించిందని అడగ్గా ది గర్ల్‌ఫ్రెండ్ మూవీయే అంటూ తెలిపింది.





# శివలో మోహన్‌బాబును రిజెక్ట్ చేసిన వర్మ

తెలుగు సినిమా చరిత్రను రాయాల్సి వస్తే, 'శివ'కు ముందు తర్వాత అంటూ పేర్కొంటారు సినీ విశ్లేషకులు. కేవలం తెలుగు మూవీపైనే కాదు, భారతీయ సినిమాలో ఒక ట్రెండ్‌ను సృష్టించింది. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో నాగార్జున కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం కల్ట్ మూవీగా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అత్యాధునిక హంగులతో, 4కె విజువల్స్‌తో నవంబరు 14న ఈ మూవీ మరోసారి ప్రేక్షకులకు ముందుకు రానున్న సందర్భంగా ఈ ఆసక్తికర విషయాలు మీకోసం.. 'శివ' సినిమాలో నటించిన నాగార్జున, రఘువరన్, అమల ఇలా ఓ నలుగురైదుగురు మినహాయిస్తే, అందరూ కొత్తవారు. ఇందులోని ఓ పాత్ర కోసం విలక్షణ నటుడు మోహన్‌బాబు పేరును చిత్ర బృందం పరిశీలించింది. అటు దర్శకత్వశాఖతో పాటు, ఇతర టెక్నీషియన్స్ కూడా అప్పుడే ఇండస్ట్రీకి వచ్చారు. ఈ సినిమా కథా చర్చలు జరుగుతుండగా, రఘువరన్ దగ్గర రౌడీగా పనిచేసే గణెశ్ పాత్రకు ఎవరిని తీసుకోవాలా?అని చర్చిస్తుండగా, నిర్మాత అక్కినేని వెంకట్ మోహన్‌బాబు పేరును సూచించారు. హీరోకు వార్నింగ్ ఇచ్చే స్థాయి ఉండాలంటే అందరికీ తెలిసిన నటుడు అయితే బాగుంటుందని సలహా ఇచ్చారు. పైగా అప్పటికే ఆయన ప్రతినాయకుడిగా పలు పాత్రల్లో నటించి మెప్పించారు. ఆయనతో తనకున్న పరిచయంతో సులభంగా ఒప్పిస్తానని కూడా చెప్పారు. అయితే, ఇందుకు రాంగోపాల్‌వర్మ ససేమిరా అన్నారు. ఆ పాత్రలో మోహన్‌బాబును పెట్టుకుంటే ఆ సీన్ ఎఫెక్టివ్‌గా ఉండదని అన్నారట. అందుకు కారణం కూడా వర్మ చెప్పారు. 'తెలుగు ప్రేక్షకులకు మోహన్‌బాబు సుపరిచితులు. ఆయన నటన, డైలాగ్ డిక్షన్ ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి వ్యక్తి 'శివ' పాత్రకు వార్నింగ్ ఇస్తుంటే, ఆ పాత్రలో ప్రేక్షకుడికి మోహన్‌బాబు కనపడతారు తప్ప, కరుడుగట్టిన రౌడీ కనిపించడని వర్మ అన్నారట. దీంతో ఆ పాత్రలో విశ్వనాథ్ అనే నటుడుని తీసుకున్నారు. ఇక 'శివ'లో ఎలాంటి డూప్ లేకుండా నాగార్జున ఒక స్టంట్ చేశారు. లారీని పట్టుకుని సైకిల్‌పై వెళ్లడం. తనని చంపడానికి వచ్చిన రౌడీల నుంచి తప్పించుకునే క్రమంలో పాపను సైకిల్‌పై ఎక్కించుకుని నాగార్జున వెళుంటారు. అప్పట్లో అది అంత డేంజరస్ షాట్ అని వర్మకు అనిపించలేదట. సైకిళ్లపై వెళ్లేవాళ్లు చాలా మంది లారీ చైన్‌లు, బస్సులను పట్టుకుని వెళ్లడం గమనించిన ఆయన అలాంటి సన్నివేశాన్నే ఇందులోనూ తీశారు. నాగార్జున కూడా ఎలాంటి భయం లేకుండా ఆ షాట్ చేశారు. ఇక క్లైమాక్స్‌లో భవంతిపై జరిగే ఫైట్ సీన్‌లో గాలి ఎఫెక్ట్ కోసం పెద్ద ప్రొఫెల్లర్‌ను మోసుకుంటూ పది అంతస్తులు ఎక్కింది చిత్ర బృందం. ఈ ÷ట్ సీక్వెన్స్‌లో నాగార్జున, రఘువరన్ ఒకరి మెడను మరొకరు నొక్కుకుంటూ కనిపిస్తారు. ఈ సన్నివేశం తీసే సమయానికి రఘువరన్‌కు డేట్స్ కుదరలేదు. దీంతో నాగార్జున కనిపించే సీన్‌లో డూప్‌ను పెట్టి, హైదరాబాద్‌లో షూట్ చేయగా, రఘువరన్ కనిపించే సీన్‌ను చెన్నైలో తీశారు.



# నానికి తల్లిగా సోనాలి కులకర్ణి

సోనాలి కులకర్ణికి జాతీయ స్థాయిలో మంచి పేరుంది. మరాఠీ, హిందీ, గుజరాతీ, తమిళ, ఇంగ్లీష్ చిత్రాలలో నటించిన సోనాలీ కులకర్ణి ఏ పాత్ర చేసినా అందులోకి పరకాయ ప్రవేశం చేస్తుంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న 'ది ప్యారడైజ్' మూవీలో సోనాలి కులకర్ణి కీలక పాత్రను పోషిస్తోంది. నవంబర్ 3 సోనాలి కులకర్ణి పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'ది ప్యారడైజ్' మేకర్స్ ఆమెకు శుభాకాంక్షలు తెలియచేస్తూ ఓ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సినిమా నుండి వచ్చిన 'రా స్టేట్ మెంట్' గ్లింప్స్ కు సోనాలి కులకర్ణి ఇచ్చిన వాయిస్ నూ ఎవ్వరూ అంత తేలికగా మర్చిపోరు. ఓ పెక్యులర్ మాడ్యుల్ లో సోనాలి కులకర్ణి 'రా' గా చెప్పిన డైలాగ్స్ డైనమేట్ మాదిరి పేలాయి. ఆ గ్లింప్స్ లోని వాయిస్ ను వింటే... నాని తల్లి పాత్రను సోనాలి కులకర్ణి చేస్తోందనే విషయం బోధపడుతుంది. ఇందులో ఆమె పాత్ర కూడా అద్భుతంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. చాలామంది సోనాలి కులకర్ణి నటిస్తున్న తొలి తెలుగు సినిమా 'ది ప్యారడైజ్' అనుకుంటారు కానీ ఆమె చాలా కాలం క్రితమే తెలుగులో మోహన్ కోడా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'ఎల్లమ్మ' అనే చిత్రంలో నటించింది. ఆ సినిమాలో నాజర్, రేవతి కీలక పాత్రలు పోషించారు. ఇక 'ది ప్యారడైజ్' విషయానికి వస్తే... ఎస్.ఎల్.వి. సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్న ఈ మూవీలో మరో కీలక పాత్రను విలక్షణ నటుడు మోహన్ బాబు చేస్తున్నాడు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్న ఈ సినిమా వచ్చే యేడాది మార్చి 26న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**